Andhra Jyoti, Vijayawada. Regd. No. H. 543 ఉదయం ★★ Telephone: 1343

ఆంధ్రజ్యోతి

ఎడిటర్: నార్ల వెంకటేశ్వరరావు

చందా రేట్లు

	పేజెంట్ ద్వారా రు. న.పై.	పోస్టుద్వారా రు. న.పై
ఒక మాసానికి	2 65	2-75
మూడు మాసాలకు	7-75	8-00
ఆరు మాసాలకు	15-50	16-00
సంవత్సరానికి	31-00	32-00

సర్క్యులేషన్ మేనేజర్
ఆంధ్రజ్యోతి, పో. బా. నెం. 334, విజయవాడ 2.

సంపుటి 6 :: సంచిక 141 | విజయవాడ, నవంబర్ 23, 1965 మంగళవారం | 6 పేజీలు :: 8 పైసలు

కట్టుకథలపుట్టపాకిస్తాన్

న్యూఢిల్లీ, నవంబర్ 22 — ఉన్నత భారత సైనికాధికారులు గల ఒక విమానాన్ని సరిహద్దు దాటించి, పాకిస్తాన్‌కు మళ్ళించడానికి ప్రయత్నించిన భారతీయ వైమానికుని భారతీయ వైమానిక దళాధిపతి అర్జున్‌సింగ్ కాల్చి చంపివేసినట్లు పాకిస్తాన్ నుంచి వెలువడే "హార్నింగ్ న్యూస్" పత్రిక ఇటీవల ఒక కట్టు కథను ప్రకటించింది. కాల్చివేయబడిన ఆ వైమానికుడు ఇండియా వైస్-ప్రెసిడెంట్ జాకీర్‌హుస్సేన్ కుమారుడని కూడా ఆ పత్రిక వ్రాసింది. అయితే ఈ వార్త అసత్యమని ఆ పత్రికే తర్వాత ప్రకటించింది.

యూనివర్శిటీల సవరణ బిల్లుల వాయిదాకు వైముఖ్యం

కౌన్సిల్ నుంచి ప్రతిపక్షాల వాకౌట్

విశ్వవిద్యాలయాల స్వతంత్ర ప్రతిపత్తి పరిరక్షణ ఆసక్తిపై ముఖ్యమంత్రి వివరణ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్ నవంబరు 22—

విద్యావేత్తలు, పత్రికలు వ్యక్తపరచిన తీవ్రవిమర్శల దృష్ట్యా విశ్వవిద్యాలయం సవరణ బిల్లుల పరిశీలనను వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని కోరి విఫలమైన పిదప ప్రతిపక్షసభ్యులు నేడు శాసనమండలి నుంచి వాకౌట్ చేశారు.

కేంద్ర విద్యామంత్రి శ్రీ చాగ్లా, అంతర్ విశ్వవిద్యాలయాల బోర్డు చైర్మన్ డాక్టర్ సి. పి. రామస్వామిఅయ్యర్ ఎద్దనుంచి తనకు వర్తమానం అందినట్లు ముఖ్యమంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి శాసనమండలిలో ధృవపరచారు. వారిరువురు బిల్లులోని నిబంధనలపై వ్యాఖ్యానాలు చేశారు.

తాను శ్రీ చాగ్లాకు మూడుపేజీల లేఖ వ్రాస్తూ రాష్ట్రప్రభుత్వం వాదనను వివరించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు, "బిల్లు పరిశీలన వాయిదా సమస్య తలఎత్తదు" అని శ్రీ బ్రహ్మానందరెడ్డి అన్నారు. అయితే అకడమిక్ సంస్థల స్వరూపంపై వచ్చే సూచనలను పరిశీలించడానికి ప్రభుత్వం విముఖత ప్రదర్శించడంలేదని ఆయన అన్నారు.

ఆందోళన ఉస్మానియా విశ్వవిద్యాలయం వరకు మాత్రం పరిమితమై వున్నదని, దానికి కారణం దానికున్న కొన్ని సంప్రదాయాలని ముఖ్యమంత్రి అన్నారు. కొందరి ప్రయోజనాలు దెబ్బతినగలవనే భావం ఏర్పడివుండవచ్చునని అన్నారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఉపాధ్యాయేతర సిబ్బంది ఆందోళనలో చేరడాన్ని ఆయన నిరసించారు. ఈ విధమైనచర్య అవాంఛనీయ పరిణామాలకు దారితీయగలదని ముఖ్యమంత్రి హెచ్చరించారు.

బిల్లు పరిశీలనను వాయిదావేయాలనే అభ్యర్థనను ముఖ్యమంత్రి త్రోసిపుచ్చుతూ విశ్వవిద్యాలయాల స్వతంత్ర ప్రతిపత్తిని పరిరక్షించాలని ప్రభుత్వం ఎంతో ఆసక్తితో వున్నదని, అకడమిక్ స్వేచ్ఛకు భంగకరం కాని వాతావరణం సృష్టించాలనే ఆకాంక్ష వున్నదని అన్నారు.

ఈబిల్లు రాజకీయ జోక్యానికి ఆస్కారం ఇస్తుందనే వాదనను ఆయన ఖండించారు.

"దేశం ప్రతిఒక్కరిని సంప్రతించడానికి వీలుగా బిల్లు పరిశీలనను వాయిదావేయడం సాధ్యపడదని అన్నారు.

శాసనమండలి గ్యాలరీలు నేడు ప్రొఫెసర్లు, ఉస్మానియా విశ్వవిద్యాలయం సెనెట్ సభ్యులతో క్రిక్కిరిసి పోయినవి.

సంయుక్త సలెక్టు కమిటీ నివేదించిన రూపంలో ఉస్మానియా, ఆంధ్ర, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయాలపై ఒకేసమానాతన చెందిన మూడుబిల్లులను విద్యామంత్రి శ్రీ ఎ. బలరామరెడ్డి ప్రతిపాదించినపిదప ప్రతిపక్ష సభ్యులు తిరిగి తమ స్థానాలకు వచ్చారు.

ముఖ్యమంత్రి ఇంతకుపూర్వం వివరించడం జరిగినదృష్ట్యా తాను బిల్లులను ప్రతిపాదిస్తూ చెప్పవలసినదేదీ లేదని విద్యామంత్రి అన్నారు.

వైస్-ఛాన్సలర్ల నియామకం పద్ధతి, అకడమిక్ సంస్థలో సభ్యత్వంస్వరూపం, విధానాలపై ప్రభుత్వం అదేశాలకు అవకాశం కల్పించే నిబంధనలు మున్నగువాటిపై ప్రతిపక్ష సభ్యులు తమ ప్రాతికూల్యం వ్యక్తపరచగా, కాంగ్రెసు సభ్యులు, డి ప్యూటీ చైర్మన్ శ్రీ ఎం. ఆనందం మాట్లాడుతూ కొంతకాలం నిపేదికకోసం ఎదురుచూడకుండా శ్రీ చాగ్లా బెనారస్ విశ్వవిద్యాలయం సవరణ బిల్లును తీసుకురాగా ఈ బిల్లును ఎందుకు ఆమోదించకూడదో అర్థంకావడం లేదని అన్నారు.

ఉస్మానియా యూనివర్శిటీ ఉదాత్త సంప్రదాయాలను గురించి శ్రీ మద్గుం చేసిన వివరణను ముఖ్యమంత్రి ప్రస్తావించి, ప్రస్తుత చట్టం అమలులోనికిరాకముందు ఉస్మానియా వైస్ ఛాన్సలర్‌నుకూడా నియమించడమే జరిగేదని అన్నారు.

సెలక్టు కమిటీ నిర్ణీత గడువులో బిల్లులను త్రిప్పి పంపినందున ఈ బిల్లులపై సభ పరిశీలన జరుపవాదంటూ శ్రీ వై. సి. రంగారెడ్డి లేవనెత్తిన పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను అధ్యక్షుడు త్రోసిపుచ్చుతూ చర్చను మద్గుం మొహిద్దీన్ ప్రారంభిస్తూ కనీసం విద్యావ్యవహారాల కమిషన్ తన నివేదికను పూర్తిచేసేవరకు, వివిధ విశ్వవిద్యాలయాల సంస్థలు ఈ బిల్లులపై తమ అభిప్రాయాలను వ్యక్తంచేసేవరకైనా బిల్లుల పరిశీలనను వాయిదా వేయాలని అన్నారు.

ఈ సవరణ బిల్లులను తేవడానికి తగిన కారణాలను ప్రభుత్వం చూపలేక పోయిందన్న మద్గుం వాదాన్ని శ్రీ గోవిందరాజులు నాయుడు, శ్రీ సోమయాజులు, శ్రీ సుబ్బరాజు ప్రభృతులు సమర్థించారు.

నిజాం నిరంకుశపాలన కాలంలో కూడా ఉస్మానియా యూనివర్శిటీ కొంత స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛా వాతావరణాన్ని అనుభవించిందని శ్రీ మద్గుం అన్నారు.

బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళన జరపాలని ఉస్మానియా సిబ్బందిచేసిన నిర్ణయంలో ఎవో లక్ష్యాలు ఉన్నాయని ముఖ్యమంత్రి అన్నమాటలను మద్గుం ప్రస్తావించి, అధికారుల ప్రాబల్యంగల సెనేట్, సిండికేట్‌లలో తమ పరిస్థితి ఏవిధంగా వుంటుందో ఊహించుకున్నందు వల్లనే సిబ్బంది ఆందోళనకు నిర్ణయించుకున్నారని అన్నారు.

ఈ బిల్లులను ఆమోదించడంవల్ల యూనివర్శిటీలు భాది బోర్డు ప్రతిపత్తికో, పంచాయతీ సమితి ప్రతిపత్తికో దిగజారిపోగలవని ఆయన అన్నారు.

యూనివర్శిటీ వర్గాలవారు ఈ సవరణ బిల్లులపట్ల తీవ్ర వైముఖ్యాన్ని వ్యక్తం చేస్తున్నారని, దీన్ని పాటించకుండా ఉస్మానియా యూనివర్శిటీ బిల్లును చట్టంచేయడానికే ప్రభుత్వం పూనుకొనే పక్షంలో అనేకమంది రాజీనామాలు చేయగలరని శ్రీ మద్గుం హెచ్చరించారు.

శ్రీ సోమయాజులు విమర్శ

బిల్లులను శ్రీ సోమయాజులు నిశితంగా విమర్శిస్తూ వీలైనంతగా అధికారాలను గుంజుకోవాలన్న ప్రభుత్వ ప్రయత్నానికి ఈ బిల్లులు నిదర్శనమని అన్నారు.

ఈ బిల్లులు ప్రభుత్వానికి విశేషాధికారాలను కల్పిస్తున్నాయని, ఛాన్సలర్ స్వతంత్రించి నిర్ణయాలు చేసే అవకాశం ఉండదని శ్రీ సోమయాజులు వివరించారు.

శ్రీ ఆనందం సమర్థన

బిల్లులను శాసనమండలి ఉపాధ్యక్షుడు శ్రీ ఆనందం సమర్థించారు. యూనివర్శిటీల పూర్వ సంప్రదాయాలను గురించిన బొగత్తలతో తాను ఏకీభవించవని, గత చరిత్ర అంతా విదేశీ ప్రాబల్యం, నిరంకుశ పాలనలలో నిండివున్నదని ఆయన అన్నారు.

ఈ బిల్లులను ప్రజల ప్రతినిధులు చట్టాలు చేస్తున్నారని, ఈ బిల్లులవల్ల సంక్రమించే అధికారాలను నిరంకుశంగా చెలాయించడం

(మిగతా 4 వ పేజీలో)

"సవరణ బిల్లుపై ప్రాంతీయ సంఘం పరిశీలన అవసరం"

—ఉస్మానియా సెనేట్ విజ్ఞప్తి

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్, నవంబర్ 22—

ఉస్మానియా యూనివర్శిటీ చట్టం సవరణబిల్లుపై పరిశీలనను వాయిదా వేయాలని యూనివర్శిటీ సెనెట్ నేడిక్కడ జరిపిన అత్యవసర సమావేశంలో ప్రభుత్వానికి మరొకసారి విజ్ఞప్తి చేసింది.

ప్రభుత్వంగనుక ఈ బిల్లును పరిశీలించ సంబంధించిన నిబంధనలుకూడా అనుచితమైనదానికి నిర్ణయించుకుంటే బిల్లులో కొన్ని తంగా వున్నవని సభ్యులు విమర్శించారు.

ఉస్మానియా యూనివర్శిటీప్రణాళిక స్థానంలో శాసనసభ చట్టాన్ని 1959లోనే ఆమోదించినందువల్ల బిల్లును సవరించే అగత్యంలేదని సెనెట్‌సభ్యులు అభిప్రాయపడ్డారు.

కొత్త చట్టం ఏ విధంగా ఆచరించబడుతున్నదో నిర్ణయించడానికి తగినంత వ్యవధి ఇవ్వాలని ఈ సమావేశం సూచించింది.

ప్రస్తుతం వున్న వైస్ ఛాన్సలర్ క్రింటటి ఏడాదిలోనే నియమితులైనందువల్ల ఆయన

(మిగతా 4 వ పేజీలో)

అగ్రహించిన యువతి అఘాయిత్యం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, నవంబర్ 22—అనంతపురం జిల్లా గంగాలివల్లి గ్రామంలో విషాహారం భుజించినట్లు అనుమానించబడుతున్న ఆరుగురు వ్యక్తులు మరణించారని ఇక్కడ పోలీసు ప్రధాన కార్యాలయానికి నేడు సమాచారం చేరింది.

మరి ఆయిదుగురి పరిస్థితి ప్రమాదకరంగా వున్నందున వారిని చికిత్స నిమిత్తం హిందూపురం ఆసుపత్రిలో చేర్చారు.

డెమికోటపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అదినారాయణరెడ్డి, వివాహానంతరం గంగాలిపల్లిలో బంధువులకు విందు భోజనాలు ఏర్పాటు చేశాడు.

విందులో కూర్చుని భోంచేస్తున్న ఒక పన్నెండేళ్ళ బాలుడు తన కడుపులో మంట పుడుతున్నట్లు చెప్పాడు. మిగతా వారుకూడా అదేమాట చెప్పారు. భోజనాలలో అప్పటికి చారు వడ్డించడం జరిగిందట.

మిగతావారు భోంచేయడం వెంటనే విరమించారు.

లేపాక్షిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గ్రామానికి వచ్చి లోపుగా ఇద్దరు బాలురు, ఒకస్త్రీ మరణించారు. మరొకరు లేపాక్షిలోని ఆరోగ్య కేంద్రంలో మరణించారు.

పరిస్థితి విషమించిన మరికొందరిని హిందూపురం ఆసుపత్రిలో చేర్చారు. ఆసుపత్రిలో ఇద్దరు మరణించారు.

ఫిర్యాదు దారుడైన అదినారాయణ రెడ్డి తమ్ముడుభార్య గంగమ్మ అనేయువతి తనను నిర్లక్ష్యంచేసి తన చెల్లెలకు వివాహం చేశాయకదా అన్నఈర్ష్యతో వంటలు తయారవుతున్నసమయంలోవంటకాలలో విషం కలిపి వుంటుందని అనుమానిస్తున్నారు.

గంగమ్మ పరారయినదనికూడాతెలియవచ్చింది.

సోవియెట్ రష్యా పర్యటన ముగించుకుని స్వదేశం తిరిగివచ్చిన ఆర్థిక మంత్రి శ్రీ కృష్ణమాచారి ఢిల్లీ విమానాశ్రయంలో ఆర్థికశాఖ కార్యదర్శి శ్రీ ఎస్. భూతలింగంతో ముచ్చటిస్తున్న దృశ్యం

"ప్రత్యేక సమస్యల చర్చకు నేను అమెరికా సందర్శించడం లేదు"

సుహృద్భావపూర్వక పర్యటన మాత్రమేనని ప్రధాని శాస్త్రి వివరణ

కాశ్మీర్‌పై ఇండియా వైఖరిని విశదీకరించగలనని లోకసభలో ప్రకటన

న్యూఢిల్లీ, నవంబర్ 22—

తన అమెరికా సందర్శన సుహృద్భావపూర్వకమైనదిగా మాత్రమే వుంటుందని ప్రధాని శ్రీ శాస్త్రి నేడు లోకసభలో ప్రకటించారు. త్వరలో తన పర్యటనపై నిర్ణయం గైకొనడం జరగగలదని, అయితే "వెంటనే అమెరికా వెళ్ళే ప్రశ్న లేదు" అని అన్నారు.

ఎట్టి నిర్దిష్టమైన సమస్యలను చర్చించడానికి తాను అమెరికా వెళ్ళడంలేదని ప్రధాని నేడు లోకసభలో స్పష్టపరచారు. అయితే కాశ్మీర్‌పై ఇండియా వైఖరిని తాను విశదీకరించగలనని అన్నారు.

అమెరికా ఆర్థిక సహాయంపై చర్చలు జరగవచ్చునని, అయితే "నా సందర్శన దానితోఎట్టి సంబంధంలేదు" అని శ్రీ శాస్త్రి అన్నారు.

శ్రీ ఓంకార్‌లాల్‌బెర్వా అడిగిన ప్రశ్నకు ప్రధాని జవాబుచెబుతూ కాశ్మీర్‌పై ప్రెసిడెంట్ జాన్సన్‌తో సంప్రతించిన నిరాకరించాలనే సంకల్పం తనకు లేదని అన్నారు.

శ్రీ ఇంద్రజిత్‌గుప్తా మాట్లాడుతూ ఇటీవల అమెరికాలో పర్యటించివచ్చిన శ్రీ ఎస్. కె. పాటిల్ కాశ్మీర్‌లో ప్లెబిసైట్ జరపడంనే ఉద్దేశాన్ని అమెరికా విడనాడిందని ప్రకటించారని, అయినప్పటికీ కాశ్మీర్ వివాదాస్పద ప్రాంతంగా అమెరికా పరిగణిస్తున్నదని, దానిపై ఇండియా, పాకిస్తాన్‌లు రాజీపడాలని సూచిస్తున్నదని అన్నారు. ఈ సమస్యపై అమెరికా వైఖరిని మార్చడానికి ప్రధాని అమెరికా సందర్శిస్తున్నారా. నిర్దిష్టమైన సమస్యలను చర్చించడానికి వెడుతున్నారా ? అని అయన అడిగారు.

ప్రధాని శ్రీ శాస్త్రి జవాబు చెబుతూ "ప్రత్యేకమంగా నా అమెరికా సందర్శన సుహృద్భావపూర్వకమైనదిగా వుంటుంది. నేను ఆ దేశం సందర్శించలేదు."

"అమెరికా సందర్శన వాయిదాపడిన సందర్భంలో నేను పేర్కొన్నట్టు నేను ఆ దేశం నాకు అనుకూలమైన సమయంలో సందర్శించగలనని" అన్నారు.

"కాశ్మీర్‌వంటి సమస్యలను సంబంధించి సంతవరకు వివిధ దేశాలు విభిన్న అభిప్రాయాలు కలిగివున్నాయి. కాశ్మీర్ సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని దాదాపు అన్నిదేశాలు కోరుతున్నాయి.

"మనం దానిలో ఏకీభవిస్తాము. శాంతియుత పరిష్కారం గౌరవప్రదమైన ప్రాతిపదికపై జరగాలి. గౌరవప్రదమైన ఒప్పందం గాని పక్షంలో దానిని మనం అంగీకరించడమనే ప్రసక్తి లేనేలేదు.

"అమెరికా వెళ్ళినప్పుడు ఆ సమస్య తప్పకుండా వస్తుంది, మన విధానాన్ని సుస్పష్టంగా నేను వివరించగలను" అని ప్రధాని అన్నారు.

శ్రీ యశ్‌పాల్‌సింగ్ అడిగిన ప్రశ్నకు ప్రధాని జవాబుచెబుతూ తాను అమెరికా వెంటనే వెళ్ళే ప్రశ్నలేదని, అయితే త్వరలో వెళ్ళడం జరగగలదని అన్నారు.

లావోస్‌లో అమెరికన్ విమానాల దాడి

హాంకాంగ్, నవంబర్ 22— లావోస్‌లోని కమ్యూనిస్టు సైనిక దళాలపై నాలుగు అమెరికన్ విమానాలు దాడిచేసిన సందర్భంలో అంతర్జాతీయ కంట్రోల్ కమిషన్‌కు చెందిన భవనం దెబ్బతిన్నట్టు నవజైనా వార్తా సంస్థ తెలిపినది.

అమెరికన్ విమానాలు రాకెట్లను, శతఘ్నులను వినియోగించినవి భాంగ్‌భే ప్రాంతంలో జరిగిన ఈ దాడిలో అంతర్జాతీయ కంట్రోల్ కమిషన్ హెలికాప్టర్లు వినియోగించే విమానాశ్రయం కూడా దెబ్బతిన్నది.

ఒక అమెరికన్ విమానం దెబ్బతిన్నది.

తుంగభద్ర నుంచి కృష్ణాడెల్టాకు నీరు

ప్రభుత్వకృషిపై శ్రీ సుబ్బారెడ్డి వివరణ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్, నవంబర్ 22—

కృష్ణాడెల్టాలోను, పశ్చిమ గోదావరి జిల్లాలోని కొన్ని ప్రాంతాలకు రెండవ పంటకు తుంగభద్ర నీటిని సప్లయి చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం శక్తివంచనలేకుండా కృషిచేస్తున్నదని నీటి పారుదల శాఖమంత్రి శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డి నేడు శాసన సభలో చెప్పారు.

గత మూడు సంవత్సరాలనుంచి రెండవ పంటకు తుంగభద్ర నీరు విడుదలచేయడం జరుగుతున్నదని శ్రీ ఎ. సర్వేశ్వరరావు, శ్రీ కె. సత్యనారాయణల ప్రశ్నకు అయన సమాధానంగాచెప్పారు.అయితే సప్లయిచేసిన నీటికి చెల్లించవలసిన మొత్తాలను వివాదం కారణంగా ఇంత వరకు చెల్లించలేదన్నారు.

రాయల్టీ చెల్లింపు సమస్య

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాయల్టీ చెల్లించడానికి సిద్ధంగా ఉన్నదని,అయితే మైసూరు సాగుచేసిన ఎకరాలపై డబ్బు చెల్లించాలని కోరుతున్నదని శ్రీ సుబ్బారెడ్డి చెప్పారు.

ఈ సంవత్సరం కృష్ణానదిలో నీరు తగ్గిపోయిందన్నారు. వర్షపాతం కనుమలలో మామూలుగా వర్షం కురిసినా కృష్ణలో నీరు ఎందుకుతగ్గిపోయిందని శ్రీ తెన్నేటి విశ్వనాథం ప్రశ్నించారు. అధికారంలేకుండా నీటిని తరలించడం ఏమయినా జరిగిందా? అనికూడా అయన ప్రశ్నించారు.

అందుకు మంత్రి "లేదు" అని సమాధానం చెప్పారు.

మొత్తం భూమిని మాగాణి కింద సాగుచేయదలిస్తే తుంగభద్రలో కూడా తగినంతగా నీరులేదని శ్రీఎ. ఒ సత్యనారాయణరాజుకు మంత్రి సమాధానం చెప్పారు. మామూలు పద్ధతికింద 50 శాతం భూమి మాగాణిసాగు, 50 శాతం భూమి మెట్టసాగు చేయవలసి వుందన్నారు. అయితే ఇందుకు రైతులు అంగీకరించలేదు. అందువల్ల మొదటి పంటకు మొత్తం మాగాణి సాగుచేశారు. లోకరైజేషన్‌చేసిన మెట్టకు మొదట పంటకు కావలసిన నీటినే సరఫరాచేశారు.

నాగార్జునసాగర్‌కు తొమ్మిది కోట్లు

1964-65లో నాగార్జునసాగర్‌కు నాలుగు కోట్లు, తుంగభద్ర ఎగువకాలువకు 25 లక్షలు కేంద్రం ఇచ్చిందని శ్రీ పి. ఒ. సత్యనారాయణరాజు ప్రశ్నకు సమాధానంగా మంత్రి చెప్పారు. పోలంపాడు ప్రాజెక్టు విషయంలో కృతీయ ప్రణాళిక కాలంలో కేటాయించిన 3 37 కోట్ల రూపాయలు చాలునని కేంద్రం భావించిందన్నారు.

1965-66 లో నాగార్జున సాగర్‌కు తొమ్మిది కోట్ల రూపాయలు, తుంగభద్రకు 1.98 కోట్ల రూపాయలు అదనపు సహాయం కోరామని, ఈ విషయం కేంద్ర పరిశీలనలో గలదని అయన అన్నారు.

మధ్యతరహా ప్రాజెక్టులు

కృతీయ ప్రణాళికలో చేర్చ ఆత్మస్థైర్యాదికాంక్షన్ పొందిన అయిదు మధ్యతరహా ప్రాజెక్టులకు 231.02 లక్షల రూపాయలు అదనపు నిధికావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిందని మంత్రి చెప్పారు.

పరాహ రిజర్వాయరు పంపా రిజర్వాయరు, కనుపూరుకాల్వ, లంకసాగర్, నల్లవాగు మధ్యతరహా ప్రాజెక్టులుగా ఉన్నాయి.

వ్యవసాయోత్పత్తుల పెంపుదలకు విరివిగిన నిబంధనలు వర్తించనందుకు ప్రత్యేక సహాయానికి పై అయిదు పథకాలు తగినవిగా లేవని కేంద్రం చెప్పింది.

విద్యుత్‌కు మూడు కోట్లు

విద్యుదుత్పాదక కేంద్రాల విషయంలో ఎగువ సీలేరు, శ్రీశైలం, కొత్తగూడెం పథకాలకు 740 లక్షల రూపాయలు అదనంగా కావాలని కోరగా, ప్రణాళిక సంఘం మూడు కోట్ల రూపాయలు మాత్రమే అదనపు సహాయం మంజూరు చేసిందన్నారు.

గ్రామీణ విద్యుత్ సరఫరా పథకాలు

వ్యవసాయోత్పత్తులు పెంపుచేయడానికి గ్రామీణ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాచేసే కొన్ని పథకాలకు 813.33 లక్షల రూపాయలను అదనపు సహాయంగా ఇవ్వవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరగా, ఇంతవరకు 20 లక్షల రూపాయలు మాత్రమే ఇచ్చిందని చెప్పారు.

1895 చిన్నతరహా నీటివనరులు

1964-65 లో1895 చిన్నతరహా నీటివనరులుపునరుద్ధరించడంజరిగిందని శ్రీ కె.మారారెడ్డికి మంత్రి చెప్పారు. 65,403 ఎకరాల భూమి ఇందువల్ల సాగులోకి వచ్చింది. 147.17 లక్షల రూపాయలు వ్యయమయాయి.

ప్రస్తుత ఫసలీలో నీరు సప్లయిచేయకపోయినా నీటి తీర్వా వసూలుచేస్తున్నందుకు చెరువులూరు రైతుల ఫిర్యాదులను పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ విచారణచేస్తున్నారని శ్రీ ఎస్. వేమయ్యకు మంత్రి చెప్పారు.

గత సంవత్సరం రాష్ట్రంలో వరదల సందర్భంగా తీసుకున్న సహాయకార్యక్రమాలకు వ్యయంచేసిన మొత్తంలో కొంత కేంద్ర సహాయం లభించగలదని రాష్ట్రప్రభుత్వం భావిస్తున్నట్టు ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి చెప్పారు. శ్రీ ఎస్. వేమయ్య తదితరులు చేసిన ప్రశ్న సందర్భంలో అయన ఈ విషయం కలుగజేసుకొన్నారు.

ఇందుకోసం 4.5 కోట్ల రూపాయలను కేంద్రంనుంచి సహాయంగా కోరామని, అయితే నిర్వహించిన రోడ్ల మరమ్మతు మొదలయిన కార్యక్రమాలు ఇమనివారణ నిబంధనావళికింద రావని అందువలన తాము సహాయం చేయలేమని, కేంద్ర రెవిన్యూ శాఖ మంత్రి శ్రీ ఎన్. రామచంద్రారెడ్డి చెప్పారు. అయితే ఈకార్యక్రమాన్ని ఇమనివారణ నిధినుంచి ఇచ్చి పెట్టడం జరిగిందన్నారు.

పాతరాజు ప్రభృతులకు పౌర సన్మానం

హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌చే

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్, నవంబర్ 22—

ఇటీవల జరిగిన ఇండో-పాక్ పోరాటంలో అపూర్వ ధైర్య సాహసాలను ప్రదర్శించి అవార్డులు పొందిన యోధులకు హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నేడు పౌరసన్మానం చేసింది.

నేడు సన్మానంపొందిన వారంతాఆంధ్రప్రదేశ్‌కు చెందినవారే.

వింగ్‌కమాండర్ గుడ్‌మన్, మేజర్ ఎమ్. ఎమ్. జాకీ, హవల్దార్ పోతరాజు, శ్రీమతి ప్రవీణ్ తారాపోర్ (పరమ వీరచక్ర అవార్డుపొందిన లెఫ్టినెంట్ కర్నల్ తారాపోర్ సతీమణి) లకు నేడు సన్మానం జరిగింది.

"మహావీరచక్ర" పొందిన వింగ్‌కమాండర్ గుడ్‌మన్, "వీరచక్ర" పొందిన మేజరు జాకీ ఇద్దరు హైదరాబాద్‌కు చెందినవారే. అయితే వీరు నేటి సన్మానానికి హాజరుకాలేకపోయారు.

వెండితోచేసిన చార్మినార్ ప్రతిమపొదగబడిన ఖడ్గాలను సన్మానితులకు మేయరు శ్రీమతి సరోజినీ పుల్లారెడ్డి సమర్పించారు.

మేజర్ జాకీ, వింగ్ కమాండర్ గుడ్‌మన్‌తరఫున ఈబహుమానాలను బ్రిగేడియర్ సయీద్, ఎయిర్ కమోడోర్ రత్న స్వీకరించారు.ప్రారంభంలో హవల్దార్ పోతరాజు, తారాపోర్ సతీమణిని ఊరేగించడంజరిగింది.

సన్మానానికి హవల్దార్ పోతరాజు కృతజ్ఞతను తెలియజేస్తూ, దుర్మార్గమును ప్రతిఘటించడానికి రక్షణ దళాల వారు ఎప్పుడూ సన్నద్ధులేనని దీనికై ఎంతటి త్యాగానికైనా వారు వెనుదీయరని అన్నారు.

ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ఇటీవలి పోరాటంలో మన సైనికులు చూపిన ధైర్యసాహసాలు, తెగువ దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. మన స్వాతంత్ర్యాన్ని, సెక్యూలర్ విధానాన్ని పరిరక్షించగలరని మన సైనికులు రుజువు చేశారని ముఖ్యమంత్రి అన్నారు.

1965 నవంబర్ 23 మంగళవారం
శ్రీ విశ్వావసునామ సంవత్సర
కార్తీక అమావాస్య
అమావాస్య : సా॥ 7.40 అనూరాధ : తె॥ 3.10
వర్జ్యం : ఉ॥ 6.30 నుంచి 8.09 వరకు

1965 నవంబర్ 24 బుధవారం
శ్రీ విశ్వావసునామ సంవత్సర
మార్గశిర శుద్ధ పాడ్యమి
పాడ్యమి : సా॥ 10.02 జ్యేష్ఠ : తె॥ 4.29
వర్జ్యం : ఉ॥ 9.04 నుంచి 10.45 వరకు

ఆంధ్రజ్యోతి

"తమసోమా జ్యోతిర్గమయ"

కన్నీటి తుడుపు

కొండను త్రవ్వి ఎలుకను పట్టినట్టు భద్రతా సంఘం ఎట్టకేలకు దక్షిణ రొడీషియాపై ఒక తీర్మానం చేసింది. కొన్ని రోజుల తర్జన భర్జనల తరువాత, పెక్కుసార్లు సమావేశం వాయిదా పడిన తరువాత చేసిన ఈ తీర్మానం దక్షిణ రొడీషియా సంక్షోభాన్ని పరిష్కరించగలదనేది సందేహాస్పదంగానే మిగిలిపోయింది.

స్మిత్ ప్రభుత్వంపై ఇప్పటికే బ్రిటన్ పెక్కు ఆర్థిక ఆంక్షలను విధించింది. వాటిని అమలు చేయడంలో తనతో సహకరించవలసిందిగా ప్రపంచ రాజ్యాలను అది కోరింది. ఇప్పుడు భద్రతాసంఘం చేసినదల్లా బ్రిటన్ విధించిన ఆంక్షలను సమర్థించడం; కొత్త విశేషమల్లా పెట్రోలు, పెట్రోలియం సరకులతో సహా అన్ని రకాల వాణిజ్యాన్ని దక్షిణ రొడీషియాతో నిలిపివేయాలని ప్రపంచ రాజ్యాలను ఆదేశించడం.

దక్షిణ రొడీషియాకు అత్యవసరమైన పెట్రోలు సరఫరాలను నిలిపివేయడం చాలా తీవ్రచర్య కాగలదనడం, స్మిత్ ప్రభుత్వాన్ని అది ఒక ఊపు ఊపగలదనడం నిస్సందేహమే. ఈ చర్యతోను, ఇంకా బ్రిటన్ తలపెట్టిన ఇతర చర్యలతోను ప్రపంచ రాజ్యాలు సహకరించగలవనడంలో కూడా సందేహం లేదు. అయినప్పటికి ఇందులో రెండు ప్రధాన లోపాలు లేకపోలేదు.

ఒకటి—బ్రిటిష్ ఆంక్షలతోగాని, భద్రతా సంఘం తీర్మానంతోగాని దక్షిణాఫ్రికా, పోర్చుగల్ ఏకీభవించడంలేదు. ఈ రెండు దేశాలు స్మిత్ స్వాతంత్ర్య ప్రకటననే బలపరుస్తున్నాయి. వీటి సహకారం లేనిదే మిగతా ప్రపంచ రాజ్యాలు ఎంత కఠిన చర్యలు గైకొన్నా, అవి ఫలప్రదం కాగల అవకాశం లేదు. ఆ రెండు దేశాలు దక్షిణ రొడీషియాతో యథావిధిగా వాణిజ్యం కొనసాగించినంతకాలం స్మిత్ ప్రభుత్వం చెక్కుచెదరబోదు. ఆ విధంగా జరుగకుండా చేయడానికి దక్షిణాఫ్రికా, పోర్చుగల్‌లనుకూడా పాశ్చాత్య రాజ్యాలు వెలివేస్తాయా?

రెండవ లోపం—భద్రతాసంఘం తీర్మానాన్ని బలపరచినప్పటికి, బ్రిటన్‌లో ఈ విషయమై ఏకాభిప్రాయం లేదు. విల్సన్ ప్రభుత్వం ఒకటి రెండు ఓట్ల మెజారిటీతో ఊగిసలాడుతున్నది. దక్షిణ రొడీషియాలోని మైనారిటీ ప్రభుత్వాన్ని ఏ విధంగానైనాసరే లొంగదీయాలనే వాంఛ విల్సన్ ప్రభుత్వానికి గాఢంగా వున్నదనడానికి దాఖలాలు లేవు. అందుకే ఆర్థిక ఆంక్షలను మాత్రం విధించి, తనపని అయిపోయినట్టు చేతులు ముడుచుకొని వూరకున్నది. దానికి కూడా కన్సర్వేటివ్‌ల నుంచి ప్రబలమైన ప్రాతికూల్యం వున్నది. ఈ స్థితిలో అది ఎంత కాలం, ఎంత తీవ్రంగా ఆంక్షలను కొనసాగిస్తుంది? ఈ ఆంక్షలవల్ల స్మిత్ ప్రభుత్వాని కిప్పటిలో రాగల ప్రమాదమేమీ లేదని తేలుస్తున్నది. కాలం గడుస్తున్న కొద్దీ ఈ ఆర్థిక ఆంక్షల తీవ్రత కూడా తగ్గిపోక తప్పదు.

బలప్రయోగంతోనైనా స్మిత్ ప్రభుత్వాన్ని లొంగదీయాలని పట్టుబట్టిన ఆఫ్రికన్ రాజ్యాలు ఈ రాజీ తీర్మానానికి ఎందుకు అంగీకరించాయో తెలియదు. చివరకు దక్షిణ రొడీషియాలో అధిక సంఖ్యాకుల విముక్తి, ఆఫ్రికన్ రాజ్యాలు సమష్టిగా గైకొనే చర్యల మీద, అంతకంటె ఎక్కువగా స్థానిక జాతీయ నాయకులు అంతర్విభేదాలను విస్మరించి విమోచనోద్యమం సాగించడంమీద ఆధారపడివుంటుంది. మిగతా చర్యల స్థితి కన్నీటి తుడుపుకింద్రే లెక్క.

అనవసరమైన ఆందోళన

బెనారస్ హిందూ యూనివర్శిటీ పేరును మార్చి, "మదనమోహన మాలవీయ కాశీ విశ్వవిద్యాలయం"గా దానికి తిరిగి నామకరణం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేసిన నిర్ణయం పట్ల ఆ యూనివర్శిటీ విద్యార్థులు చేస్తున్న ఆందోళన హద్దులు తప్పింది; శ్రుతిమించి రాగానపడినట్టు కనిపిస్తున్నది.

రాష్ట్రపతి రాధాకృష్ణన్ మొన్న కాశీని సందర్శించినప్పుడు బెనారస్ యూనివర్శిటీ విద్యార్థులు జరిపిన ప్రదర్శనలు, వారు చేసిన నినాదాలు ఆ పవిత్ర విద్యాసంస్థ ప్రతిష్ఠకుగాని, స్థాయికిగాని, దాని స్థాపకుడు శ్రీ మాలవీయ విద్యార్థులలో లక్షించిన క్రమశిక్షణకుగాని అనుగుణంగా లేవు.

తాను స్వయంకృషితో—ఊరూరు "బిచ్చ" మెత్తి—స్థాపించిన ఆ విశ్వవిద్యాలయం పేరులో "హిందూ" అన్న పదాన్ని శ్రీ మాలవీయ చేర్చడానికి కారణం—దానికి బ్రిటిష్ ప్రభుత్వంతో ఎలాంటి సంబంధం లేదని సుస్పష్టం చేయడానికే; ఆ రోజులలో బ్రిటిష్ ప్రభుత్వం ఆధ్వర్యంలో స్థాపించబడుతున్న విశ్వవిద్యాలయాలకు ఇది భిన్నమైనట్టిదని పేర్కొనడానికే.

కాగా, ఇప్పుడు కాలం మారింది; మన దేశ పరిస్థితులే మారిపోయాయి. ఇండియాకు స్వాతంత్ర్యం సిద్ధించింది. మత ప్రసక్తిలేని లౌకిక ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని రూపొందించుకున్నాము. "సెక్యులర్" ఇండియాలో ఏ సంస్థకైనా మతాల పేర్లు, కులాల నామధేయాలు వుండడం వాంఛనీయంకాదు. ముఖ్యంగా విద్యాసంస్థలకు—జాతి, మత, కుల, వర్ణ విభేదాలకు అతీతంగా భావిభారత పౌరులను తీర్చిదిద్దవలసిన విద్యా సంస్థలకు—ఇది బొత్తిగా అనుచితం; ప్రమాదకరంకూడా. అలాగే అలిఘర్ "ముస్లిం" యూనివర్శిటీలో మతాన్ని సూచించే పదాన్ని తొలగించడం కూడా అవసరం.

ఇంతకూ, కాశీ విశ్వవిద్యాలయానికి దాని స్థాపకుడు మాలవీయజీ పేరునే పెడుతున్నప్పుడు విద్యార్థులు ఆందోళనచెందవలసిన అవసరమేమున్నది?

గోబెల్స్ అడుగుజాడలలో

ఏ అసత్యాన్ని అయినాసరే ఏడుసార్లు వల్లిస్తే అది సత్యమైపోతుందట. ఇది మాజీ నాజీ సమాచారశాఖ మంత్రి గోబెల్స్ గత యుద్ధకాలంలో వాడుకలోకి తెచ్చిన సూక్తి; స్వయంగా అనుసరించిన కుయుక్తి కూడా.

పాకిస్తాన్ నాయకులకు నాజీల పోలికలు కొన్ని వున్నాయి. వారివలెనే వీరికీ మరాక్రమణ కాంక్ష సరసరాలలో జీర్ణించుకుపోయింది. వారిని జాత్యహంకారం వలెనే వీరిని మత విభేద జాడ్యం పట్టిపీడిస్తున్నది. అందుచేత అసత్య ప్రచారంలోకూడా నాజీ పద్ధతులనే వారు అవలంబించడంలో ఆశ్చర్యం లేదు.

ఇటీవలి ఇండో-పాక్ సంఘర్షణలో మరికొన్ని గంటలలో యుద్ధవిరమణ జరుగుతుందనగా, ఇండియన్ ఫ్రిగేట్ నొకదాన్ని తాము ముంచివేసినట్టు పాకిస్తాన్ ప్రభుత్వం ప్రకటించింది. వారు పేర్కొన్న నౌక ఐ.ఎన్.ఎస్. బ్రహ్మపుత్ర. అది సురక్షితంగానే వున్నట్టు భారత ప్రభుత్వం తెలియజేసినా, పాకిస్తాన్ మాత్రం తన అసత్య ప్రచారాన్ని మానలేదు. ఈ నెల ఒకటవ తేదీన భారతీయ నౌకను "ముంచివేసిన" ఇద్దరు పాక్ నౌకాధికారులకు ప్రెసిడెంట్ అయూబ్ ఖాన్ ఉత్తుత్తి "సన్మానం" కూడా చేశాడు. యుద్ధంలో తమకు తీవ్ర పరాభవం జరిగిన విషయాన్ని ప్రజలనుంచి దాచడానికే అతని పాట్లు.

మొన్నటి సంఘర్షణ కాలంలో పాకిస్తాన్ ఇటువంటివే ఉత్తుత్తి సంఘటనలను—తమ విజయాలను సూచించేవాటిని—కల్పించి ప్రచారం చేసింది. వాటిని పాశ్చాత్య దేశాల వారు సమ్మడంకూడా జరిగింది. ఇప్పుడిప్పుడు వారు పాకిస్తాన్ ప్రచారంలో నిజమెంతో, అబద్ధమెంతో గ్రహిస్తున్నారనుకోండి. అయినా, మొన్న ఐ.ఎన్.ఎస్. బ్రహ్మపుత్రను భారత ప్రభుత్వం విదేశ రాయబార కార్యాలయాలకు చెందిన నౌకోద్యోగులకు, విలేకరులకు ప్రదర్శించి చూపడంతో గోబెల్స్ తత్త్వం పాకిస్తాన్ పాలకులకు ఎంతగా తలకెక్కిందో వారికి పూర్తిగా అవగాహన అయివుండాలి.

గోబెల్స్ సూక్తి ప్రకారం అసత్యం సత్యంగా కొంతకాలంపాటు చెలామణి కావచ్చుగాని, నిజం నిలకడమీద తెలియక పోదనే సామెతను కూడా పాక్ నాయకులు గుర్తుంచుకోవడం మంచిది.

విశ్వవిద్యాలయాల సవరణ బిల్లు: కొన్ని నిర్మాణాత్మకమైన సూచనలు

ఆంధ్ర, శ్రీ వెంకటేశ్వర, ఉస్మానియా విశ్వవిద్యాలయాల చట్టాలకు క్రిందటి శాసనసభా సమావేశంలో ప్రతిపాదించిన సవరణ బిల్లులపై జాయింటు సెలెక్టు కమిటి నివేదికను ముఖ్యమంత్రి శాసన పరిషత్తుకు సమర్పించారు. విశ్వవిద్యాలయాలపై అనుసరించవలసిన విధానాలపై ఆదేశాలు జారీచేసే అధికారం ప్రభుత్వానికి సంక్రమింపజేయాలని ఈ కమిటి సిఫారసు చేసింది. అంటే ఇకనుంచి విశ్వవిద్యాలయాలను ప్రభుత్వ విద్యాశాఖలో అంతర్భాగంగా పరిగణిస్తారని విశదమవుతున్నది.

ఈ విషయంలో విద్యావేత్తల భయసందేహాలు నిజమైనవి. భారతదేశంలోగాని, ప్రపంచంలో మరే దేశంలోగాని విశ్వవిద్యాలయాలు అనుసరించదగు విధానాలపై ప్రభుత్వం ఆదేశాలు జారీచేసే పద్ధతి ఆచరణలో లేదు. ఎందువల్లనంటే, యూనివర్శిటీలు ఇలాంటి విషయాలపై స్వయంగా నిర్ణయించుకొనడానికి తగు నిపుణులు, ప్రొఫెసర్లు, విద్యావేత్తలుగల విద్యాసంస్థ. ప్రభుత్వ వ్యాపార సంస్థలకు అనుసరించవలసినవిధానంపైప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం ఆచరణలో వున్నది. కాని, విద్యాసంస్థలు వ్యాపార సంస్థలు కావుగదా!

అసలు ప్రభుత్వం విద్యావిషయంలో ఏ పద్ధతిని అనుసరించాలో విశ్వవిద్యాలయాలనుంచి సలహాలు స్వీకరిస్తే విద్యాప్రమాణ అభివృద్ధికిదోహదకారి కాగలదు. అసలు మన రాజ్యాంగంలోని ఆదేశ సూత్రాల ప్రకరణంలోనే ప్రభుత్వం అనుసరించవలసిన విద్య విధానం నిర్వచింపబడింది. కాబట్టి, విశ్వవిద్యాలయాలు అనుసరించవలసిన పద్ధతిపై ప్రభుత్వం జోక్యం కలుగజేసుకొనడమనేది విశ్వవిద్యాలయ స్థాపనసూత్రాలకే విరుద్ధం. కావున, విశ్వవిద్యాలయాలకున్న "అనటమీ"ని తొలగించేప్రయత్నం ప్రభుత్వం చేయరాదు. అలా చేస్తే, విశ్వవిద్యాలయాలు నిర్జీవ సంస్థలుగా తయారవుతాయి.

సుప్రీంకోర్టు న్యాయమూర్తిని ఏ యే పద్ధతులలో పదవి నుంచి తొలగించవచ్చునో, ఆ పద్ధతుల మీదనే యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్లను పదవి నుంచి తొలగించాలని సెలక్టు కమిటీ చేసిన సిఫారసును విద్యాభిలాషు లందరూ హర్షించదగినది.

వైస్ ఛాన్సలర్

కాని, వైస్-ఛాన్సలర్ల నియామకంపై అనుసరించదగు పద్ధతి అన్నిటిలోకి ముఖ్యమైనది. కావున, వైస్-ఛాన్సలర్ పదవి రాజకీయంగా పలుకుబడి వున్న వ్యక్తులకు లభించకుండా ప్రముఖ విద్యావేత్త లెవరికైనా లభించేట్టు చూడవలసిన బాధ్యత విద్యారంగం అభిమానులందరికీ కలదు.

ఛాన్సలర్ వైస్-ఛాన్సలర్‌ను సరాసరి నామినేట్ చేయడానికిఅభ్యంతరంవుండదు. కాని,ఆచరణలో ఛాన్సలర్ రాష్ట్రగవర్నర్ కాబట్టి ఆ నియామకం విద్యామంత్రిచేనియామకంగామారుతుంది. కావున, గవర్నర్ ఛాన్సలర్‌గా విధులు నిర్వహించే బాధ్యతను గవర్నర్ హోదాలోగాక, తన వ్యక్తిగత హోదాలో నిర్ణయం తీసుకొనాలని సవరణబిల్లులో నిర్దేశించడం సమంజసం. అది సాధ్యంకాకపోతే, రాష్ట్ర హైకోర్టుప్రధాన న్యాయమూర్తిని ఛాన్సలర్‌గాచేస్తూ సవరణ తీసుకురావచ్చు.

వైస్-ఛాన్సలర్ల పదవీకాల పరిమితి సవరణ బిల్లులో రూపొందించినట్టు మూడు సంవత్సరాలు గాక ఇప్పటివలెనే అయిదు సంవత్సరాలు వుంచాలి. రెండు పర్యాయాలు కంటె ఎక్కువసార్లు ఆ పదవి అలంకరించకూడదన్న నిబంధన అనవసరం. ఎందువల్లనంటే, వైస్-ఛాన్సలర్లు ఆ పదవిని అలంకరించడానికి ఎన్నికలలో పోటీ చేయడంలేదు. ఛాన్సలర్‌కు ఇష్టం లేకపోతే మరొక పర్యాయం నియమించరుగదా. కావున, సమర్థులైనవారిని రెండుసార్లకంటె ఎక్కువసార్లు నియామకం చేయవచ్చు.

సెనెట్ సభ్యుల సంఖ్య

సెనెట్ సభ్యుల సంఖ్యను తగ్గించాలని,ప్రస్తుతమున్న సిండికేటు వ్యవస్థలో మార్పుచేయాలని ఈ కమిటి చేసిన సూచన హర్షించదగింది. శాసన సభ్యులలో సెనెట్ సభ్యత్వం కోరేవారు కనీసం పట్టభద్రులై వుండడం అభిలషించదగింది. కాని, సెనెట్ సభ్యులు ఎన్నుకొనే నలుగురు సిండికేట్ సభ్యులలో ఒకరు తప్పక శాసనసభ్యులైవుండాలనే సవరణను ఉపసంహరించుకోవాలి. చాన్సలర్ నామినేటు చేసే నలుగురు సిండికేట్ సభ్యులలో ఇద్దరు ఇతర రాష్ట్రాలకుచెందిన విద్యావేత్తలైతే విద్యాభివృద్ధికి తోడ్పడగలదు. రాష్ట్ర అడ్వకేటు జనరల్‌ను కూడా సిండికేట్ సభ్యత్వానికి నామినేట్‌చేస్తే, విశ్వవిద్యాలయాలు చట్టబద్ధంగా వ్యవహరించడానికి తోడ్పడగలదు.

రిజిస్ట్రార్ స్థాయి

యూనివర్శిటీ పరిపాలన సమర్థంగా జరిపించడానికి రిజిస్ట్రార్ స్థాయిని పెంచడం అవసరం. కావున రిజిస్ట్రార్‌ను ఎక్స్ అఫీషియో సిండికేట్ సభ్యుని చేయాలి. మూడు విశ్వ విద్యాలయాలలోను ఒకే పాఠ్య ప్రణాళికను అనుసరించడం వాంఛనీయంగాలేదు. ఎందువల్లనంటే, ఆయా విశ్వవిద్యాలయాలు ప్రత్యేక విశిష్టతను సంపాదించుకొనడానికి ప్రయత్నించవు. ఒకవేళ సమష్టి పాఠ్య ప్రణాళికను రూపొందించ దలచుకొంటే, రాష్ట్రంలోని అన్ని కళాశాలలను ఒక్క యూనివర్శిటీకే అనుబంధం చేసి, సమష్టి పరీక్ష పెడితే రాష్ట్రమంతటా ఒకే విద్యా ప్రమాణం నెలకొల్పడమే కాకుండా, మిగతా రెండు యూనివర్శిటీలు పోస్టు-గ్రాడ్యుయేట్ కోర్సుల ప్రమాణాలను అభివృద్ధి పరచి పరిశోధన కేంద్రాలుగా కృషి చేయడానికి అవకాశం లభిస్తుంది.

మన విశ్వవిద్యాలయాలలో విద్యా ప్రమాణాలు చాలా తక్కువని ఐ. ఏ. యస్. పోటీ పరీక్షల ఫలితాలనుబట్టి రుజువవుతున్నది. కావున, మన రాష్ట్రంలోని మూడువిశ్వవిద్యాలయాలు ఆక్సఫర్డ్ సెంట్రిడ్జ్, హార్వర్డ్ విశ్వవిద్యాలయాలవలె కనీసం భారతదేశంలో ప్రసిద్ధిచెందాలంటే, విద్యాప్రమాణాలను అత్యుత్తమస్థాయికి పెంపొందించడానికి ప్రభుత్వం కృషిజరపాలి. యూనివర్శిటీల గౌరవాన్ని తక్కువచేసి, వాటి స్వాతంత్ర్యాన్ని అరికడితే అది సాధ్యపడదు. కావున, విద్య విషయాలలో విద్యావేత్తల సలహాలనే ప్రభుత్వం పాటించాలి. ఈ సూచనలను దృష్టిలోపెట్టుకొని మన ప్రభుత్వం సవరణబిల్లులో అవసరమైన మార్పులు చేస్తుందని ఆశిద్దాము.

— శ్రీ ఎ. ఎస్. బోస్

నెహ్రూ గుణ విశేషాలు

శ్రీమతి వైలెట్ ఆల్వా ప్రభృతుల ప్రశంస

న్యూఢిల్లీ, నవంబర్ 22 — ఉత్కృష్ట ప్రజాస్వామ్య వాదిగా, పార్లమెంటరీ సాంప్రదాయాలను జీర్ణించుకు ప్రవర్తించిన మహోన్నత వ్యక్తిగా స్వర్గీయ నెహ్రూను రాజ్యసభ డిప్యూటీచైర్మన్ శ్రీమతి వైలెట్ ఆల్వా, పార్లమెంటు సభ్యులు శ్రీ గంగాశరణ్ సిన్హా, శ్రీ ఎల్. ఎం. సింఘ్వీలు పేర్కొన్నారు.

పార్లమెంటు భవనంలో సాహిత్య సంఘానికి ప్రారంభోత్సవం జరిగిన సందర్భంలో వారు నెహ్రూపై ప్రసంగించారు.

మతతత్త్వాన్ని, కులతత్త్వాన్ని నెహ్రూ ఎదిరించారని, భారతదేశం చిన్నాభిన్నం కాకుండా ఆయన పరిరక్షించారని శ్రీమతి వైలెట్ ఆల్వా అన్నారు. ప్రజాస్వామ్యవాదిగా నెహ్రూ చాలా గొప్పవారని శ్రీ సిన్హా పేర్కొన్నారు.

రాజకీయాలలో నెహ్రూ ఉత్తమ సంస్కారం కలిగిన మహోన్నతుడుగా శ్రీ సింఘ్వీ అభివర్ణించారు.

అమెరికన్ కంపెనీ సహకారంతో బిర్లా కంపెనీవారు గోవాలో 26 కోట్ల పెట్టుబడితో నెలకొల్పదలచిన ఎరువుల ఫ్యాక్టరీకి అనువైన స్థలంగా మార్మాగావ్‌ను ఎన్నుకొన్నట్టు పంజిం వార్త.

"విశాఖపట్నంలో ఉక్కు ఫ్యాక్టరీ స్థాపనతథ్యం"

—ముఖ్యమంత్రి ఆశాభావం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్, నవంబర్ 22—

ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి నేడు శాసనసభలో మాట్లాడుతూ, ఐదవ ఉక్కు కర్మాగారాన్ని ఆంగ్లో-అమెరికన్ కన్‌సోర్టియమ్ సిఫారసుల మేరకు విశాఖపట్నంలో స్థాపించడానికి ప్రధాన మంత్రి సుముఖంగా ఉన్నారని తమకు అభిప్రాయం కలిగిందని అన్నారు.

శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య ప్రవేశపెట్టిన కాల్ అటెన్షన్ మోషన్‌కు సమాధానంగా ఇండియా ప్రభుత్వం ప్రచురించిన కన్‌సార్టియమ్ సిఫారసులను శ్రీ బ్రహ్మానందరెడ్డి శాసనసభ ముందుంచారు.

ఐదవ ఉక్కుకర్మాగారం విశాఖపట్నంలో స్థాపించాలని కన్ సార్టియంచేసిన సిఫారసుల ఫలితంగా రాష్ట్రంలో వ్యాపించిన ఆశలను ఆయన జ్ఞప్తికి తెచ్చారు. ఈ ఆశలగనుక నిరాశలైతే రాష్ట్రమంతటా విషపరిణామాలు ఏర్పడగలవని ముఖ్యమంత్రి హెచ్చరించారు.

కేంద్రం కన్ సార్టియం నివేదికను ఆమోదించుతుందని తాము పూర్తివిశ్వాసంతో ఉన్నట్టు శ్రీ బ్రహ్మానందరెడ్డి అన్నారు.

ప్రకాశిప్రాయాన్ని. శాసన సభ్యుల ఏకగ్రీవ అభిప్రాయాన్ని గురించి ప్రధాన మంత్రికి తెలియజేస్తామని. మరి రెండు పర్యాయాలు కలుసుకొని ఈ విషయానికి సంబంధించి నిశ్చయనిర్ణయం చేయవలసిందిగా కోరామని ముఖ్యమంత్రి అన్నారు. కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖహూడా కన్‌సార్టియంకు ఇచ్చిన గడువును పొడిగించాలని ప్రధాన మంత్రికి వ్రాసిందని ఆయన తెలియజేశారు.

కన్‌సార్టియం ఇచ్చిన రిపోర్టు దృష్ట్యా కానీ, పారిశ్రామికంగా ఆంధ్రప్రదేశ్ వెనుకబడి ఉండడందృష్ట్యాగానీ మరే దృష్టితో చూసినా విశాఖపట్నంలో ఉక్కు కర్మాగారాన్ని నిర్మించడం తప్పనిసరి అవుతుందని ముఖ్యమంత్రి తెలియజేశారు.

ఈ విషయంమీద తీర్మానంలాంటిదేమైనా చేయలసిన అవసరమేదైనా ఉంటే ఆ విషయాన్ని తరువాత చర్చించవామని ఆయన అన్నారు.

విషాహారం తిన్న 300 మంది విద్యార్థినులు

మదురై సమీపాన దుస్సంఘటన: 20 మందికి ప్రమాదస్థితి

మదురై, నవంబర్ 22— ఇక్కడికి సుమారు 26 మైళ్ళ దూరంలో గల ఉసిలంపట్టి లోని విద్యార్థినుల వసతిగృహంలో దాదాపు 300 మంది విషాహార పీడితులైనారు. వారు చపాతీలు తినగా వాంతులు ప్రారంభమైనవట. వారికి చికిత్స జరపడానికి మదురై నుంచి 17 మంది డాక్టర్లు, అయిదుగురు నర్సులు మందులతో హుటాహుటిని వెళ్ళారు. చికిత్స చేసిన తర్వాత చాలమంది పరిస్థితి మెరుగుపడిందని, 90 మందికి ఇంకా చికిత్స జరపవలసివున్నదని, వారిలో 20 మంది ప్రమాదస్థితిలో వున్నారని ఇరవై నుంచి 30 మంది ఉపాధ్యాయినులు తెలియజేశారు.

"సౌభ్రాత్రాన్ని ప్రబోధించండి"

ఉపాధ్యాయులకు కాశ్మీర్ ముఖ్యమంత్రి విజ్ఞప్తి

శ్రీనగర్, నవంబర్ 22 — బాలలకు విద్యాబోధనచేసే సమయంలో ఉపాధ్యాయులు సెక్యులరిజం, మానవ సౌభ్రాతల సంప్రదాయాలను పెంపొందించవలసిందిగాకాశ్మీర్ ముఖ్యమంత్రి శ్రీ జి. ఎం. సాదిక్ నిన్న విజ్ఞప్తిచేశారు.

ఈ సాంప్రదాయ ప్రభావం విద్యార్థుల మీద పడకపోతే భవిష్యత్తు తరాలలో కల్లోలం తప్పగలదన్నారు.

ఇక్కడ ఇటీవల జరిగిన విద్యార్థుల అల్లరులను ప్రస్తావిస్తూ సంఘ విద్రోహ శక్తులు తమ స్వప్రయోజనాల కోసం విద్యార్థిలోకాన్ని అవకాశంగా తీసుకొంటున్నదన్నారు.

కొన్ని విద్యా సంస్థలలో మతతత్వం జీర్ణించుకున్నదని, అలాంటివాటిని మూసివేస్తామని ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన చెప్పారు.

న్యాయమూర్తి శ్రీ రాజు గౌరవార్థం ఢిల్లీ ఆంధ్ర సంఘం విందు

న్యూఢిల్లీ, నవంబర్ 22— సుప్రీంకోర్టు న్యాయమూర్తి శ్రీ సత్యనారాయణ రాజు గౌరవార్థం ఆంధ్ర సంఘం నిన్న ఇక్కడ విందు చేసింది.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన శ్రీ పి. రాజు ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయినారు.

సభకు అధ్యక్షత వహించిన కేంద్ర ఉక్కుగనుల శాఖ మంత్రి శ్రీ ఎన్. సంజీవ రెడ్డి, శ్రీ రాజు గుణవిశేషాలను ప్రస్తుతించారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తి శ్రీ కోకా సుబ్బారావు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పార్లమెంటు సభ్యులు విందుకు హాజరయినారు.

వినోబాభావే నేపాల్ ప్రయాణం

ఖట్మండూ, నవంబర్ 22 — నేపాల్ రాజు మహేంద్ర ఆహ్వానాన్ని పురస్కరించుకొని సర్వోదయ నాయకుడు ఆచార్య వినోబాభావే వచ్చే వేసవిలో నేపాల్ సందర్శించగలరని నిన్న ఇక్కడ తెలియవచ్చింది.

ఆచార్య భావేను ఇటీవల కలుసుకున్న భారత రాయబారి శ్రీ శ్రీమన్నారాయణ్ ఈ విషయాన్ని తెలియజేశారు.

ప్రధాని ఢిల్లీ చేరిక

న్యూఢిల్లీ, నవంబర్ 22—మద్రాసులో రెండు రోజుల పర్యటన ముగించుకొని ప్రధాని శ్రీ శాస్త్రి నిన్న తిరిగి రాజధానికి వచ్చారు.

మావో వారసత్వం: ఐదుగురు పోటీదార్లు

మావో తరువాత చైనా కమ్యూనిస్టుపార్టీ పదవిని ఎవరు అధిష్ఠించవలసివస్తే విషయంపై చైనాలో "యుద్ధం" ప్రారంభమైనట్టు కనిపిస్తున్నది.

ఇటీవలనే పీకింగ్ నుంచి తిరిగివచ్చిన ఒక తూర్పు యూరపియన్ దౌత్య నిపుణుని కథనం ప్రకారం ఈ పదవికి ఇప్పటికి ప్పుడే అయిదుగురు పోటీదార్లు వున్నారట.

వారి పేర్లు ఇవి: చైనా అధ్యక్షుడు లీ షావ్-చీ, ప్రధాని చౌ ఎన్-లై, విదేశాంగ మంత్రి చెన్-యీ, రక్షణమంత్రి లిన్ పియావో. పార్టీ ప్రథమ కార్యదర్శి తెంగ్ సియావో-పింగ్.

ఇటీవలివరకు మావో వారసుడుగా లీ షావ్-చీ పరిగణించారు. లీ షావ్-చీ కమ్యూనిస్టు సిద్ధాంతకారుడు. ఈయన హునాన్ రాష్ట్రంలో ఒక మధ్యతరగతి రైతుకుటుంబంలో జన్మించాడు. 1927లో షాంఘైలో చాంగ్ కై-షేక్‌కు, కమ్యూనిస్టు లేబర్ యూనియన్‌లకు జరిగిన పోరాటంలో పాల్గొన్న అజ్ఞాతవాసనాయకులలో ఈయన ప్రముఖుడు. కమ్యూనిస్టు సిద్ధాంతాలను నూరిపోయడంలో ఈయన నిపుణుడని ప్రఖ్యాతి.

మార్షల్ లిన్ పియావో మావోకు "కుడిభుజం"అని ప్రఖ్యాతి వహించాడు. 20 సంవత్సరాల వయస్సులోనే ఆయన ఒక కెడెట్‌కు నాయకత్వం వహించాడు. 1927 పోరాటంలో ఈయనకూడా ప్రముఖపాత్ర వహించాడు. 1950 లో కొరియాలో పోరాడిన చైనా సేనానాయకుడు.

పోతే, చౌ ఎన్-లై. ఇతడు తెలివిగల రాజకీయ వేత్త. కాని పార్టీలో పలుకుబడి లేదు. ఈ పోటీదార్లు అయిదుగురులోను దుర్బలుడు ఇతడే.

మార్షల్ చెన్-యీకి "కమ్యూనిస్టు చైనా గోబెల్స్" అని పేరు. చురుకైన రాజకీయ వేత్త. ప్రధాని పదవినుంచి చౌ ఎన్-లైకి స్వస్తిచెప్పి, ఆ స్థానాన్ని ముందు ఆక్రమించి, ఆ పిమ్మట పార్టీ అధ్యక్షపదవిని ఆక్రమించాలని ఇతడి ఎత్తుగడ.

ఈఅయిదుగురిలోను ప్రమాదకారిఅయిన వ్యక్తి తెంగ్‌సియావో-పింగ్. ఇతడికి యనుమారు 63 సంవత్సరాలు, 1963 లో చౌ ఎన్-లై విదేశీపర్యటనకు వెళ్ళినప్పుడు ఇతడే తాత్కాలిక ప్రధానిగా వ్యవహరించాడు. ఇతడిది మొండిపట్టు. రష్యా, ఇండియా, అమెరికాలకు పూర్తి వ్యతిరేకి. పార్టీ కార్యదర్శి.

పార్టీ అధ్యక్షపదవి లీషావ్-చీకి, ప్రధాని పదవి తెంగ్ సియావో-పింగ్‌కు, విదేశాంగ మంత్రి పదవి చెన్-యీకి, లిన్-పియావోకు, రక్షణమంత్రి పదవి లభించడంతో ఈ పోటీ అంతంకాగలదని, ఇప్పటి ప్రధాని చౌ ఎన్-లై "శూన్యం"లోకి వెళ్ళవచ్చు. సిన్కియాంగ్ ఆటుంటుంగ్‌ని తూర్పు టిబెట్టుని అభిప్రాయం.చెప్పారు.

ఢిల్లీలో సినీకళాకారుల కార్యక్రమం

రక్షణ నిధికి అయిదు లక్షల వసూలు

న్యూఢిల్లీ, నవంబర్ 22— సినిమా తారలు, ప్లేబాక్ గాయనీగాయకులు, సంగీత దర్శకులు పాల్గొన్న పాటల కార్యక్రమం వినడానికి నిన్న సాయంత్రం ఇక్కడి నేషనల్ స్టేడియంకు వేలాది ప్రజానీకం వచ్చారు.

ఈ కార్యక్రమాలలో మొత్తం 150 మంది కళాకారులు పాల్గొన్నారు. భారత ఫిలిం పరిశ్రమకుచెందిన జాతీయ రక్షణ సంఘంవారు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. జాతీయ రక్షణ నిధికి అయిదు లక్షల రూపాయలవరకు వసూలయినట్టు.

కాశ్మీర్ ఇండియాలో అంతర్భాగమని, కాశ్మీర్‌ను ఇండియా ఎన్నడూ వదలుకోదని చెప్పే గేయాలు,సైనికుల వీరోచిత కృత్యాలను నభివర్ణించే గేయాలు పాడారు.

ఉపరాష్ట్రపతి డాక్టర్ జాకీర్ హుస్సేన్, రక్షణమంత్రి శ్రీ వై. బి. చవాన్ కొంతసేపు గేయాలను విన్నారు.

మున్సిపాలిటీలచే అప్పులకు దరఖాస్తులు

హైదరాబాద్, నవంబరు 22— తాండూరు మున్సిపాలిటీ మార్కెట్ కాని, కబేళాగాని నిర్మించడానికి ప్రభుత్వం నుంచి పది వేల రూపాయల ఋణాన్ని కోరింది. మహబూబ్ నగర్ మున్సిపాలిటీ మార్కెట్ నిర్మాణానికి 10 వేల రూపాయలు ఋణం కావాలని కోరింది. కబేళా మర్మతులకు గాను నంగారెడ్డి అయిదు వేల రూపాయల ఋణాన్ని అడిగింది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీ కంపోస్ట్ ఎరువులు తయారు చేయడానికి పది వేల రూపాయల అప్పుకు దరఖాస్తు పెట్టుకుంది.

రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ కమిటీ పునర్నిర్మాణం

హైదరాబాద్, నవంబరు 22—వరంగల్లు రీజినల్ ఎంప్లాయ్‌మెంటు కమిటీని కలెక్టర్ అధ్యక్షతన

"కరాచీతో గౌరవప్రద పరిష్కారానికి సిద్ధమే"

—మద్రాసులో ప్రధాని వివరణ

మద్రాసు, నవంబర్ 22—

ఇండియా పాకిస్తాన్‌ల మధ్య శాంతి స్థాపనకు ఎట్టి అవకాశం లభించినా మనం దానిని జారవిడవమని ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి నిన్న ఇక్కడ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తూ చెప్పారు.

అయితే శాంతి అన్నది గౌరవ ప్రదమయినదిగా ఉండాలని ఆయన అన్నారు. కాంగ్రెసువారు యుద్ధాన్ని వాంఛించరని, మనం ఎల్లప్పుడూ పోరాటం కొనసాగించమని కూడా ఆయన అన్నారు.

దేశ సమైక్యతను, సార్వభౌమత్వ ప్రతిపత్తిని పూర్తిగా పరిరక్షిస్తామని, ఎట్టి త్యాగాలు చేయడానికయినా దేశం సంసిద్ధంగా ఉన్నదని ఆయన చెప్పారు.

భారత, పాకిస్తాన్‌ల మధ్య సంభవించిన పోరాటానికిగల కారణాన్ని ఆయన వివరించారు.

పాకిస్తాన్‌తో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని ఇండియా అభిలషిస్తున్నా కరాచీ మనపై ద్వేషాన్ని వెడలగ్రక్కుతున్నదన్నారు. పాకిస్తాన్ ఇంతవరకు మూడు పర్యాయాలు దురాక్రమణచేసిన సంగతిని ఆయన ప్రస్తావించారు.

రాన్ ఆఫ్ కచ్ విషయంలో శాంతియుత పరిష్కారానికి మనంవ్యవహరించినతీరును, నెలలోగా పాకిస్తాన్ కాశ్మీర్‌పై దురాక్రమణ జరపడాన్ని శ్రీ శాస్త్రి ప్రస్తావించారు. సాయుధబలాలను, సాయుధ బలాలతో ఎదుర్కొనడమే మన జవాబు అని ప్రధాని హర్షధ్వానాలమధ్య ప్రకటించారు.

దురాక్రమణను అరికట్టడం మినహా ఇండియాకు ప్రత్యామ్నాయ మార్గం మరొకటి లేకపోయిందన్నారు. మన సైన్యాలు అసమాన ధైర్యసాహసాలతో పోరాటం జరిపాయన్నారు.

యుద్ధ విరమణానంతరంకూడా పాకిస్తాన్ మన భూభాగంలోకి చొచ్చుకు రావడానికి ప్రయత్నాలను కొనసాగిస్తున్నదని ప్రధాని చెప్పారు. అక్రమిత భారత భూభాగం నుంచి పాకిస్తాన్ ఉపసంహరించుకోవడానికి అంగీకరించకపోతే వారిని ఆ స్థావరాల నుంచి పారద్రోలడం జరుగుతుందన్నారు.

రక్షణనిధి వసూలు, బంగారం బాండ్లకు పెట్టుబడి అధికోత్పత్తి మొదలయిన కార్యక్రమాలలో కాంగ్రెస్ కార్యకర్తలుతగిన ప్రత్యేక బాధ్యతలను ఆయన వివరించారు. దేశంలోగల ఆహార పరిస్థితి విషయం ప్రస్తావించారు. దేశ సమైక్యత కోసం పాటుబడవలసిన అవసరాన్ని కాంగ్రెసు కార్యకర్తలకు ఆయన వివరించారు.

ఇండో - పాకిస్తాన్ పోరాట కాలంలో సైనికోద్యోగులకు, ప్రభుత్వోద్యోగులకు మధ్య పూర్తి సహకారం, సమన్వయం ఉన్నదని చెప్పారు.

రక్షణ నిధికి బంగారం విరాళం

ప్రముఖ సినిమా కళాకారులు, నిర్మాతలు రక్షణ నిధికి 350 నవర్సుల బంగారు అభరణాలను ప్రధాని శ్రీ లాల్ బహదూర్‌శాస్త్రికి నిన్న రాజభవన్‌లో విరాళంగా సమర్పించారు.

ఢిల్లీలో జరిగిన ఉత్సవంలో ఉపాధ్యాయులకు జాతీయ బహుమతుల ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి రాధాకృష్ణన్. వీరిలో ఎడమనుంచి మొదటి వ్యక్తి శ్రీనగర్ బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయిని శ్రీమతి మెహతాబ్ బేగం, రెండవ వ్యక్తి ఉత్తరకాశీ జిల్లాలోని అరణి హైస్కూలు ఉపాధ్యాయుడు శ్రీ ఏ. ఎన్. లక్ష్మణరావు

వ్యవసాయోత్పత్తుల ఆధారంతో పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం

—హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి వివరణ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్, నవంబర్ 22—

రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తులు ఆధారంగా గల పరిశ్రమలు నెలకొల్పడానికి ప్రభుత్వం ఒక పథకాన్ని రూపొందిస్తున్నదని, ఇట్టి పరిశ్రమలను విరివిగా స్థాపించాలని కేంద్ర ఆర్థికమంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి చాలా పట్టుదలగా వున్నారని ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి నిన్న వెల్లడించారు.

ఈ పథకంకింద ప్రయివేట్ పారిశ్రామికవేత్తలనుకూడా ప్రోత్సహించడం జరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు.

హైదరాబాద్ - విజయవాడ రోడ్డుప్రక్కన నగరశివార్లలో దక్షిణ భారత పరిశోధన సంస్థవారు నిర్మించనున్న బేసిక్ కెమికల్స్, బయోలాజికల్ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి నిన్న సాయంకాలం శంఖుస్థాపన చేశారు.

ఈ ప్రాజెక్టు నిబంధి నివాసగృహాల నిర్మాణానికి ఆర్థికమంత్రి డాక్టర్ చెన్నారెడ్డి శంకుస్థాపన చేశారు.

ఆరోగ్య మంత్రి శ్రీ ఎస్. ఆర్. వైద్యరామప్రసాద్ అధ్యక్షత వహించారు.

ఈ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ జి. ఎస్. రాజు అతిథులకు స్వాగతం చెప్పారు.

ఈ ప్రాజెక్టుకు ప్రారంభంలో ఇరవై లక్షల పెట్టుబడి అవసరమని, వందమంది సాంకేతిక నిపుణులతో సహా మొత్తం మూడు వందల మందికి ఇందులో ఉపాధి సౌకర్యం లభిస్తుందని, ప్రస్తుతం విదేశాలనుంచి దిగుమతి చేసికొంటున్న రసాయనాలు విటమిన్‌లు, "సిరిటోన్." ఇతర ఆహార పదార్థాలు ఈ కర్మాగారంలో తయారవుతాయని శ్రీ రాజు తెలియజేశారు.

ఆరోగ్య మంత్రి విజ్ఞప్తి

ఆరోగ్య మంత్రి శ్రీ వైద్యరామ ప్రసాద్ ప్రసంగిస్తూ, ఔషధాల ప్రమాణాన్ని కాపాడడం చాలా కష్టతరంగా పరిణమిస్తున్నదని, నూనెవాళ్ళ సంక్షేమం దృష్ట్యా ఔషధాల ఉత్పత్తిదార్లు, కెమిస్టులు, డ్రగ్గిస్టులు ఈ విషయాన్ని చాలా తీవ్ర సమస్యగా పరిగణించాలని విజ్ఞప్తిచేశారు.

రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో సింథటిక్ ఔషధాల కర్మాగారం నెలకొల్పిన పరితంగా, కెమికల్ బయోలాజికల్ ఉత్పత్తుల అభివృద్ధికి మంచి అవకాశాలు ఏర్పడినవని కూడా ఆయన చెప్పారు.

ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి ప్రసంగిస్తూ ఇలా అన్నారు: "రాష్ట్రంలో పరిశ్రమలు అభివృద్ధిచేయాలని ప్రభుత్వం తీవ్రంగా కృషిచేస్తున్నది. ప్రభుత్వ రంగంలోని పరిశ్రమలను రాష్ట్రంలో నెలకొల్పాలని నేను కేంద్ర ప్రభుత్వంపై ఎంతో ఒత్తిడి తెచ్చినప్పటికీ, కొన్ని పరిశ్రమలను సాధించినప్పటికీ, ప్రయివేట్ పెట్టుబడిదారులు ముందుకువచ్చి ప్రభుత్వం, వివిధ ఆర్థిక సంస్థలు అందజేస్తున్న సహాయ సహకారాలను వినియోగించుకొని రాష్ట్రమంతటా పరిశ్రమలను స్థాపించనిచేమనరాష్ట్రం అభివృద్ధి కాజాలదు.

"పరిశ్రమలు పెడతామంటే ప్రభుత్వం అన్నివిధాల సహాయం చేస్తుంది. రాష్ట్రంలో వ్యవసాయోత్పత్తులు ఆధారంగాగల పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం ఇతోధికంగా సహాయం చేస్తుంది. ఇందుకు ఒక పథకాన్ని రూపొందిస్తున్నాము. ఇట్టి పరిశ్రమల అభివృద్ధిపట్ల కేంద్ర ఆర్థికమంత్రి శ్రీ కృష్ణమాచారి చాల శ్రద్ధవహిస్తున్నారు."

ఆర్థిక మంత్రి డాక్టర్ చెన్నారెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి బలీయమైన పునాదులు ఏర్పడినవని, ఒకనాటికి భారతదేశ ఆర్థిక పటంలో ఆంధ్రప్రదేశ్ మహోన్నత స్థానాన్ని ఆక్రమించనున్నదని అన్నారు.

కంపెనీ వైస్ చైర్మన్ శ్రీ పి. పి. షాదీగా వందనసమర్పణ చేశారు.

కాశీలో విద్యార్థుల ప్రదర్శనలు

రాష్ట్రపతికి వినతిపత్రం సమర్పణ

వారణాసి, నవంబర్ 22— వారణాసీయా సంస్కృత విశ్వవిద్యాలయానికి ఎదురుగా బెనారెస్ హిందూ యూనివర్శిటీ పేరు మార్పుకు నిరసనగా పదివేల మంది విద్యార్థులు నాలుగు గంటలపాటు ప్రదర్శన జరిపారు. రాష్ట్రపతి రాధాకృష్ణన్ స్నాతకోత్సవ సందర్భంగా ప్రసంగించడానికి వెడుతూండగా కూడా విద్యార్థులు ప్రదర్శన చేశారు. వీరిలో చాలా మంది బెనారస్ హిందూ యూనివర్శిటీ విద్యార్థులు. "హిందూ" అన్నపదంలో విశ్వవిద్యాలయం పేరు నుంచి తొలగించడానికి తమ అసమ్మతిని తెలియజేస్తూ వీరు నినాదాలు చేశారు.

అధికారులు గట్టి బందోబస్తు చేశారు.

బెనారస్ హిందూ యూనివర్శిటీ పేరులో ఎట్టిమార్పు చేయరాదని, ఇందుకు తగిన కృషిచేయాలని రాష్ట్రపతిని కోరుతూ స్థానిక భారతీయ జనసంఘ్, హిందూ మహాసభలు వినతి పత్రాన్ని సమర్పించాయి.

రాష్ట్రపతి సావధానంగావిని ఈ విషయం లోకసభ చూడవలసివున్నదని, విద్యార్థులు లోకసభ సభ్యులకు నచ్చచెప్పవలసినదని చెప్పారు.

జిల్లా అధికారులు ఏర్పాటుచేసిన బందోబస్తును రాష్ట్రపతి ప్రశంసించారు. ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికి తన కృతజ్ఞతలెలియజేయవలసిందిగా గవర్నరు శ్రీ విశ్వనాథ దాసును కోరారు.

విద్యార్థుల ప్రదర్శనలను ప్రస్తావిస్తూ ప్రజాస్వామ్యంలో ప్రదర్శనలుచేయడం అవకాశం ఏమీకాదని, అయితే అదిశాంతియుతంగా ఉండాలని ఆయన అన్నారు. తమ అభిప్రాయాలను వెలిబుచ్చేహక్కు ప్రతిపౌరుడికి వున్నదని ఆయన చెప్పారు.

రూ. 10 లకే రేడియో

బేటరీ పెట్టుతో పని చేసే ట్రాన్సిస్టర్ పాకెట్ రేడియో, అన్ని భాగాలకూ గ్యారంటీగల జపాన్ తయారీ. సంగీతం, వార్తలు ఎక్కువైనా చక్కగా వినిపించే పూచీ ఇవ్వబడును. మా కొత్త పథకం ప్రకారం రూ. 10 లకే ఈ ట్రాన్సిస్టర్‌ను మీరు పొందవచ్చు. పాకింగ్, పోస్టేజీ రూ. 2-50 అదనం. తోలు కేసు ఉచితం. వి. పి. పి. కి రాయండి. నచ్చనిచో సొమ్ము వాపసు చేయబడును.

American Trading Agency
Durgiana (R-3) Amritsar.

టాంజానియాకు మూడుకోట్ల ఋణం

ఇవ్వడానికి భారతదేశం సంసిద్ధత

దారెస్సలాం, నవంబర్22—భారతదేశం టాంజానియాకు రెండు మిలియన్ పౌండ్ల ఋణాన్ని సుమారు మూడు కోట్ల రూపాయలు, ఇవ్వడానికి అంగీకరించింది. టాంజానియా రాజధాని దారెస్సలాంలో పారిశ్రామిక శిక్షణ ప్రాజెక్టును నిర్మించడానికి ఈ సహాయాన్ని వినియోగించుతారని భారత వాణిజ్య వ్యవహారాల మంత్రి శ్రీ మనూభాయ్ షా మొన్న యిక్కడ ప్రకటించారు.

సభ్యుల్వాధికారులతో రెండురోజులపాటు జరిగిన చర్చల అనంతరం పత్రికలవారితో మాట్లాడుతూ ఈ సహాయం వ్యాపార రూపంలోను, సాంకేతిక సహాయంలోను, వచ్చే సంవత్సరం చేసుకోబోయే ఆర్థిక సహాయ ఒడంబడిక రూపంలోను ఉంటుందని శ్రీ షా అన్నారు.

టాంజానియా సహకార వాణిజ్యవ్యవహారాల మంత్రి శ్రీ అబ్దుల్ రహమాన్‌బాబు జనవరి రెండవ వారంలో ఇండియా వచ్చి ఒడంబడిక మీద సంతకం పెట్టగలరని శ్రీ షా తెలియజేశారు.

భారతదేశం యిచ్చే ఈ సహాయం పైప్రేటు, ప్రభుత్వ రంగాలలో పరిశ్రమల స్థాపనకు ఉపయోగపడుతుందని సంయుక్త ప్రకటనలో తెలియజేశారు.

పారిశ్రామిక శిక్షణ ఉత్పత్తుల కార్యక్రమానికి భారతదేశం టాంజానియాకు 25లక్షల రూపాయలు విరాళంగా కూడా యిస్తుందని తెలుస్తుంది.

ఈ సాంకేతిక సహాయ కార్యక్రమం క్రింద ఇండియా సాంకేతిక సంస్థలలోనూ, యూనివర్శిటీలలోనూ, టాంజానియన్లకు భారత దేశం శిక్షణ యిస్తుంది.

ఈ మధ్యలో జాంజిబార్ నుంచి వస్తువినిమయ పద్ధతిపై భారతదేశం 35 లక్షల రూపాయల విలువగల లవంగాయలు కొనే విషయాన్ని పరిశీలిస్తుంది.

రెండు దేశాలమధ్య వ్యాపారాన్ని అభివృద్ధిచేసే విషయంమీదకూడ ప్రాథమిక చర్చలు జరిగాయి. ఈ వ్యాపారి ఒప్పందం వచ్చే జనవరిలో జరుగుతుందని భావించబడుతుంది.

భారతదేశం గత సంవత్సరం $4\frac{1}{4}$ మిలియను స్టెర్లింగులు ఖరీదుచేసే సరుకులను టాంజనియా నుంచి దిగుమతి చేసుకుంది. బదులుగా సుమారు $2\frac{1}{2}$ మిలియన్లు ఖరీదు చేసే సరుకు యెగుమతి చేసింది.

మహావిపత్కరంగా మారిన దేశ విభజన

1947 నాటి తప్పిదానికి నేటికి మూల్యం చెల్లిస్తున్నామని శ్రీ చాగ్లా వివరణ

మరొక పర్యాయం కాశ్మీర్‌లో ఇదే పొరపాటును చేయబోమని కేంద్ర విద్యామంత్రి విశదీకరణ

న్యూఢిల్లీ, నవంబర్ 22-

ఇండియా విభజన మహావిపత్కరమైనదని, "1947 లో మనం చేసిన తప్పుకు నేటికి కూడా మూల్యం చెల్లిస్తున్నా" మని కేంద్ర విద్యా మంత్రి శ్రీ ఎం సి చాగ్లా నిన్న పేర్కొన్నారు.

కాశ్మీర్ విషయంలో మరొక పర్యాయం దేశాన్ని విభజించాలనే ప్రయత్నం జరుగుతున్నదని,అయితే కాశ్మీర్,ఇండియా నెక్యులరిజానికి చిహ్నం అని అన్నారు.

లాలాలజపతిరాయ్ శతజయంతి ఉత్సవం సందర్భంలో ఏర్పాటుచేసిన సభకు శ్రీ చాగ్లా అధ్యక్షత వహిస్తూ "ఆయన నేడు (లాలాలజపతిరాయ్) సజీవులై వున్నపక్షంలో పాకిస్తాన్‌తో పోరు సల్పేవారనడంలో నాకెట్టి సందేహంలేదు" అని ఆయన అన్నారు.

ఈ సమావేశంలో ప్రధాన ఉపన్యాసకులు ఇండియా ప్రధాన న్యాయమూర్తి శ్రీ గజేంద్రగడ్కర్ నెక్యులరిజం, ఇండియా రాజ్యాంగం అనే అంశంపై ఆయన ప్రసంగించారు.

ఇండియా రాజ్యాంగం అందరికీ సమాన హక్కులను యిచ్చినదని శ్రీ చాగ్లా అన్నారు.

ఇండియా ప్రపంచానికి నెక్యులర్ దృక్పథాన్ని యిచ్చినదని, ఇండియావంటి పెద్ద దేశంలో సహజీవనం నెరపడం, సమష్టిగా జీవించడం గొప్ప కళ అని అన్నారు.

రొడీషియా, దక్షిణ ఆఫ్రికాలలో జాతి విద్వేషాలు సంఘర్షణ విషయం శ్రీ చాగ్లా ప్రస్తావించారు.

అమెరికాలో "బ్రహ్మాండమైన సాంఘిక సమస్యను" ను గురించి ఆయన పేర్కొన్నారు, అయితే మనదేశంలో భిన్నత్వంలో ఏకత్వం సాధించామని అన్నారు.

ఇండియా రాయబారిగా అమెరికాలో నియమించబడిన ఏడవ తాను ఏర్పాటుచేసిన ప్రభుత్వ పత్రికా గోష్ఠిలో ఒక అమెరికన్ విలేకరి తన మతం ఏమిటని ప్రశ్నించాడని, "నేను భారతీయుడను" అని జవాబుచెప్పానని అన్నారు. ఈ దృక్పథం అలవరచుకొనాలని శ్రీ చాగ్లా అన్నారు.

"అనేక మతాలు, సంస్కృతులు వుండవచ్చు అయితే మనం భారతీయ సంస్కృతిని సృష్టించాము. దానిని విస్మరించడం తగదు" అని అన్నారు.

నెక్యులరిజం అంటే నాస్తికవాదం కాదని నిత్యాన్వేషణ తత్వాన్ని నెక్యులరిజం గుర్తించినదని ఇండియా ప్రధాన న్యాయమూర్తి శ్రీ గజేంద్రగడ్కర్ ప్రసంగిస్తూ అన్నారు.

పాకిస్తాన్ దురాక్రమణ సందర్భంలో ప్రజల సమైక్యత తనకు ఎంతో గర్వకారణమైనదని అన్నారు.

కులాలు, వర్గాలపట్ల విధేయతను ఆయన నిరసించారు. వాటిపట్ల విధేయత చూపడం నెక్యులరిజం సూత్రానికి ప్రమాదకరమని అన్నారు. రాజ్యాంగంలో 14వ నిబంధన ఉదాత్తమైనదని, పౌరులందరికీ సమాన హక్కులను ప్రసాదించిన దానిలో ఏ పౌరునికి ఎలాంటి అధిక్యత లేదని అన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు

రోమ్ సభలో శ్రీ సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి

రోమ్, నవంబరు 22 — ఇండియా వంటి వ్యవసాయక దేశంలో సాగుపద్ధతులలో ఆధునిక శాస్త్రీయ రీతులను ప్రవేశపెట్టి పరివర్తన తీసుకురావడానికి ప్రపంచ ఆహార సంస్థ బృహత్తరమైన పాత్రను నిర్వహించాలని ఆహార వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం మొన్న ఇక్కడ పేర్కొన్నారు.

ఎరువులు,పేలిరకంవిత్తనాలువంటివాటిని సప్లయి చేయడంలో కొత్త తరహా అంతర్జాతీయం ఏర్పాటుచేయడానికి అభివృద్ధి చెందే దేశాలు ప్రపంచ ఆహారసంస్థపై ఎంతో ఆశను పెట్టుకొనడం జరిగినదని ఇండియా ఆహారమంత్రి అన్నారు.

ప్రపంచ ఆహార సంస్థ 20వ. వార్షికోత్సవం సందర్భంలో జరిగిన సభలో శ్రీ సుబ్రహ్మణ్యం ప్రసంగించారు.

అభివృద్ధిచెందిన దేశాలు తమ ఆహార ఉత్పత్తిని తగ్గించుకొనడానికి బదులు మరింతగా హెచ్చించాలని అన్నారు. ఈవిధంగా చేసినపక్షంలో ఈ శతాబ్దం చివరికి రెండు తలు పంట పండించగలదని అన్నారు.

కేంద్రం గిడ్డంగులు

రాష్ట్రంలో 17 చోట్ల నిర్మిస్తున్నట్టు ఆహార కార్యదర్శి వివరణ

న్యూఢిల్లీ, నవంబర్ 22— ఆహార ధాన్యాలకు తగిన ధరలను లభించేయడంలో సహకరించడంలో కేంద్ర గిడ్డంగుల సంస్థ నిర్వహిస్తున్న పాత్రను కేంద్ర ఆహార కార్యదర్శి శ్రీ ఎ. ఎల్. డయస్ ప్రశంసించారు.

ఆంధ్రప్రదేశ్, మద్రాసు రాష్ట్రాలలో ఈ సంస్థ భారీ ఎత్తున గిడ్డంగుల నిర్మాణం చేస్తున్నదన్నారు. ఈ గిడ్డంగులలో 5.15 లక్షల టన్నుల ఆహార ధాన్యాలను నిల్వచేయవచ్చు. ఇందువల్ల అడపాదడపా సంభవించే బియ్యం కొరతను అరికట్టడం, ధరల స్థిరీకరణ సాధ్యమవుతుంది.

సంస్థ తృతీయ వార్షికసమావేశంలో శ్రీ డయస్ ప్రసంగించారు.

ఆంధ్రప్రదేశ్‌లో 3.15 లక్షల టన్నులు నిల్వచేయడానికి వీలుగా 17 కేంద్రాలలో గిడ్డంగుల నిర్మాణకార్యక్రమం కొనసాగుతున్నది.

గిడ్డంగులు నిర్వహిస్తున్న పాత్రను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ సి. ఎస్. రామచంద్రన్ వివరించారు.

వియత్నామ్ సమస్యపై రుమేనియా మధ్యవర్తిత్వం

వియన్నా, నవంబర్ 22— వియత్నామ్ యుద్ధంలో అమెరికాకు, వియత్నామ్ కమ్యూనిస్టులకు నడుమ మధ్యవర్తిత్వం నెరపడానికి రుమేనియా సుముఖంగా వున్నట్టు రుమేనియా ప్రధాని శ్రీ జియోర్గీ మారర్ వెంట ఇక్కడకు వచ్చిన అధికారులు నిన్న వెల్లడించారు. రుమేనియా ప్రధాని ఆస్ట్రియాలో పర్యటించడానికి ఇక్కడకు వచ్చారు.

రుమేనియాలో అమెరికా రాయబారి విలియం క్రాఫర్డ్‌కు రుమేనియా విదేశాంగ మంత్రి కాన్ రెలియు మానెస్కూలమధ్య గత జూన్‌లో బుఖారెస్టులో రహస్య సంభాషణలు జరిగాయి.

న్యూయార్క్, నవంబర్ 22 — రొడీషియాలో బ్రిటన్ అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా మొన్న బ్రిటిష్ యువరాణి మార్గరెట్ గౌరవార్థం జరిగిన ఒక విందును ఆఫ్రికన్ ప్రతినిధులు బహిష్కరించారు.

హిందూమహాసముద్రంలో స్థావరం సమస్య

ఇండియా ప్రాతికూల్యానికి మారిషస్ మాజీమంత్రి అభినందన

పోర్టులూయీ, మారిషస్, నవంబర్22— హిందూ మహాసముద్రంలో ఆంగ్లో-అమెరికన్ స్థావరాన్ని ఏర్పాటుచేయడం సమస్యపై ఇండియాపైఖరిని అభినందిస్తూ మారిషస్ మాజీమంత్రి, మారిషియన్ పార్టీ నాయకుడు అయిన గైటన్‌దువల్ భారత ప్రధాని శ్రీ శాస్త్రికి ఒక కేబుల్ పంపారు.

ఈ స్థావరం స్థాపనకు ఇండియా తన ప్రాతికూల్యాన్ని తెలియజేసింది.

ఆంగ్లో-అమెరికన్ రక్షణ వ్యూహంలో భాగంగా హిందూ మహాసముద్రంలో రక్షణ స్థావరాన్ని ఏర్పాటుచేయడానికై చాగోస దీవుల సమూహాన్ని, పశ్చిమ హిందూ మహాసముద్రంలోని మరి మూడు ద్వీపాలనలభ్యం చేయడానికి బ్రిటన్ అంగీకరించింది. ఇక్కడకు 1200 మైళ్ళ దూరంలో ఉన్న చాగోస ద్వీపసమూహపు పాలనాధికారం మారిషస్ క్రింద వున్నది.

మారిషస్‌కు స్వాతంత్ర్యసిద్ధి అనంతరం ఈ దీవులను, మరికొన్ని దీవులను కలిపి ప్రత్యేక పాలనా విభాగంగా ఏర్పాటుచేయాలని బ్రిటన్ యోచిస్తున్నది.

భారత గస్తీ కేంద్రంపై పాక్ సైనికుల కాల్పులు

కలకత్తా, నవంబరు 22— నాడియా జిల్లాలోని చేదే సరిహద్దు గస్తీ కేంద్రంపై నేడు కూడా మూర్పు పాకిస్తాన్ రైఫిల్ దళం వారు కాల్పులు కొనసాగిస్తున్నట్టు ఇక్కడకు వార్తలు చేలాయి. భోయిరా గస్తీ కేంద్రంపై కూడా వీరు కాల్పులు సాగిస్తున్నట్టు వార్తలు వచ్చాయి.

రక్షణనిధికి ఆంధ్ర ఫిలిం వాణిజ్య మండలి విరాళం

విజయవాడ, నవంబరు 22—

ఆంధ్ర ఫిలిం వాణిజ్య మండలి విజ్ఞప్తి ప్రకారం జాతీయ రక్షణనిధికి చలనచిత్ర రంగానికి చెందిన అనేకమంది ఇతోధికంగా విరాళాలు ఇచ్చారు. వీరిలో చిత్ర నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు వున్నారు.

వీరు రక్షణనిధికి ఇచ్చిన విరాళం మొత్తం రు. 21,360-23 పైసలు. దీనికి తోడు ఆంధ్ర ఫిలిం వాణిజ్య మండలి తన నిధులలో నుంచి రు. 10 వేలను రక్షణ నిధికి సమర్పించారు. ఈ మొత్తం రు. 31,360-23 పైసలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డికి హైదరాబాద్‌లో సమర్పించారు.

పింప్రీలో స్ట్రెప్టోమైసిన్ ఫ్యాక్టరీ ప్రారంభం

పూనా, నవంబరు 22— ఇక్కడకు సమీపంలోని పింప్రీవద్ద హిందూస్థాన్ యాంటిబయొటిక్స్ సంస్థవారు స్ట్రెప్టోమైసిన్ ఉత్పత్తిని రెట్టింపు చేయడానికి కొత్తగా నిర్మించిన ఫ్యాక్టరీకి కేంద్ర పెట్రోలియం, రసాయనాల శాఖమంత్రి ప్రొఫెసరు హుమయూన్ కబీరు నిన్న ప్రారంభోత్సవంచేశారు.

ఈ ఫ్యాక్టరీ నిర్మాణానికి 60 లక్షలరూపాయలు వ్యయమైంది. ప్రారంభోత్సవ సభకు మహారాష్ట్ర గవర్నరు డాక్టరు పి. వి. చెరియన్ అధ్యక్షత వహించారు.

అగినపర్రు పంచాయతీ టెండరు నోటీసు

ఈ క్రింద తెలుపబడి రు. 2,900/- ఎస్టిమేటుకు, యీ క్రింద సంతకముచేసిన పంచాయతీ కంట్రాక్టర్లనుండి, మరియు P. W. D. హైదేసు కంట్రాక్టర్లనుండి టెండర్లు కోరబడుచున్నవి. టెండరు తీసుకొను అఖరు తేదీ 30-11-65 టెండర్లు పెట్టదలచినవారు రు. 150/-లు అగినపర్రు పంచాయతీ పండుకు జమచేయవలెను. ఏ కారణముచేతనైనను టెండర్లు నిరాకరించుటకు సర్‌పంచ్‌గారికి అధికారము కలదు.

పనిపేరు	టెండరు ధరావతు
అగినపర్రు పూరచెరువు రేవులు, మరియు కట్టలు బాగుచేయుట.	రు. 150/-

(సం) బొబ్బా రామారావు,
సర్‌పంచ్, అగినపర్రు P.O., కృష్ణా జిల్లా.

పాకిస్తాన్‌కు సింధు జలాల సప్లయి

కరాచీ ఆరోపణ

నిరాధారమని ఢిల్లీ ఖండన

న్యూఢిల్లీ, నవంబర్ 22— సింధుజలాల ఒప్పందానికి అనుగుణంగా తన వాటాకింద రావలసిన నీటిని విడుదల చేయకపోవడంగాని, సట్లెజ్, బియాస్ నదులనుంచి సప్లయిలను ఉపసంహరించుకొనడంగాని జరిగినట్లు చెప్పడం వాస్తవ విరుద్ధమని పాకిస్తాన్‌కు ఇండియా స్పష్టంచేసింది.

ఈ విషయమై పాకిస్తాన్ హైకమిషనర్‌కు అందజేసిన ఒక లేఖలో సెప్టెంబర్‌లో పాకిస్తానీయులు ఫెరోజ్‌పూరు హెడ్‌వర్క్సువైపు కాల్పులు జరపడంవల్ల దిపాల్నారు కాల్వకు, ఫెరోజ్‌పూరు దిగువ ప్రాంతానికి మధ్య నిరంతరాయంగా సప్లయిలు జరపడం అసాధ్యంగా పరిణమించిందని, ఎడమవైపువున్న ఇండియా కాల్వలకు కూడా నీరు విడుదల కాలేదని భారత ప్రభుత్వం తెలియజేసింది.

పరిస్థితులు ఎలా వున్నప్పటికి సట్లెజ్ జలాలలో పాకిస్తాన్ వాటా కింద రావలసిన నీటిని పూర్తిగా సప్లయిచేయడం జరిగిందని ఈ లేఖ వివరించింది.

పాకిస్తాన్ కాల్వలలో కొందరు ఇరిగేషన్ శాఖోద్యోగులు మరణించారని, మరికొందరు త్వరగా గాయపడినారని కూడా ఈ లేఖ పేర్కొన్నది.

లండన్ ప్రకటనపై బ్రిటిష్ గయానా ప్రజల నిరుత్సాహం

జార్జిటౌన్ (బ్రిటిష్ గయానా,) నవంబరు 22— బ్రిటిష్ గయానాకు స్వాతంత్ర్య ప్రదానం చేయడానికి తేదీని నిర్ణయించినట్టు మొన్న ఉదయం లండన్‌లో చేసిన ప్రకటన గురించి విని బ్రిటిష్ వలస ప్రాంతంప్రజలు ఆనంద భరితులు కాలేదు, ఆ వార్త వారిని దుఃఖితులను కావించింది.

1966 మే 26 వ తేదీన స్వాతంత్ర్య ప్రదానం జరగగలదన్న అధికార ప్రకటనపట్ల మొత్తం దేశం అనాసక్తిని, నిరుత్సాహాన్ని ప్రదర్శించింది.

శ్రీ బర్న్‌హామ్ నాయకత్వానగల మిశ్రమ ప్రభుత్వం అనుచరులు మాత్రమేకాక మాజీ ప్రధాని డాక్టర్ చెడ్డీజగన్ సారథ్యం వహిస్తున్న ప్రతిపక్షమైన పీపుల్స్ ప్రోగ్రెసివ్ పార్టీకూడా ఈ ప్రకటనపట్ల ఎట్టి ఉత్సాహాన్ని ప్రదర్శించలేదని భద్రతా అధికారులు తెలియజేశారు.

కులాలు, వర్గాలపట్ల విధేయతను ఆయన నిరసించారు. వాటిపట్ల విధేయత చూపడం నెక్యులరిజం సూత్రానికి ప్రమాదకరమని అన్నారు. రాజ్యాంగంలో 14వ నిబంధన ఉదాత్తమైనదని, పౌరులందరికీ సమాన హక్కులను ప్రసాదించిన దానిలో ఏ పౌరునికి ఎలాంటి అధిక్యత లేదని అన్నారు.

వియత్నామ్ యుద్ధంలో కొత్త పరిణామం

సైగాన్ (దక్షిణ వియత్నామ్), నవంబర్ 22— పర్వత ప్రాంతాలలో యుద్ధానికి అమెరికన్ సైనికులను ఆకర్షించి, వారిపై ఆకస్మిక దండయాత్ర చేయడం ద్వారా విజయం సాధించాలని వియత్నాంగ్ ఎత్తుగడ వేస్తున్నట్టు సమాచారం అందినది.

చుప్రాంగ్ పర్వత శ్రేణుల ప్రాంతంలో ఉత్తర వియత్నామ్‌కు చెందిన దివిజన్ సైనిక దళం యుద్ధ కార్యకలాపాలలో నిమగ్నమైనట్టు అమెరికన్‌కమాండర్లు అంచనా వేస్తున్నారు.

బయాడ్రాంగ్ యుద్ధ రంగంలో తిరిగి నిన్న సమరం చెలరేగినది.

చుప్రాంగ్ పర్వతశ్రేణి ప్రాంతం కమ్యూనిస్టు గెరిల్లాలకు సప్లయి స్థావరమని, ఉత్తర వియత్నామ్ నుంచి సాయుధ గెరిల్లాలను దక్షిణ వియత్నాంకు పంపడంలో కీలక స్థావరమని విశ్వసిస్తున్నారు.

పెద్దఎత్తున ముఖాముఖి పోరాటానికి ఇంతకు పూర్వం ఉత్తర వియత్నామ్ సైనిక దళం సంసిద్ధ పడలేదు. ఈ పర్యాయం ఆ యుద్ధ రంగంలోనే వుండి అమెరికన్, దక్షిణ వియత్నామ్ సైనికులతో పోరాటానికి సంసిద్ధంగా వున్నారు.

కడచిన పదిరోజులుగా జరుగుతున్న యుద్ధాలు అమెరికన్స్‌ను పర్వత ప్రాంతాలకు ఆకర్షించేందుకు జరుగుతున్నట్టుగా భావిస్తున్నారు.

ముఖాముఖిగా పదాతి దళం యుద్ధం చేయడం అమెరికన్‌లకు ఆందోళనకరంగా వున్నది. ఉత్తర వియత్నాం సైనికులు తమ మోర్టార్లు శతఘ్నులను యుద్ధరంగానికి తరలించకుండా రిజర్వులో వుంచి వుండవచ్చునని అంచనా వేస్తున్నారు.

వియత్నాం యుద్ధంలో భీషణ సమరం జరిగిన ప్

సిక్కిం సరిహద్దులో చైనా కవ్వింపు చర్య

రెండున్నర మైళ్ళు చొచ్చుకొనివచ్చినట్టు వెల్లడి: చైనాకు ఇండియా తీవ్ర అధిక్షేపణ

న్యూఢిల్లీ, నవంబర్ 21— సిక్కిం ఉత్తర సరిహద్దులోని డాంగ్‌చుంగ్‌కు ఈశాన్యంగా మూడుమైళ్ళ దూరంలోఉన్న గ్యామ్‌చోవా సరస్సు ప్రాంతంలో నిన్న 40 మంది చైనా సైనికులు సరిహద్దును ఉల్లంఘించి, 2.5 మైళ్ళ మేరకు మన భూభాగంలోనికి చొచ్చుకొని వచ్చారు.

ఈ ప్రాంతంలో గస్తీకి పంపబడిన భారత గస్తీ దళం ఒకటి 500 గజాల దూరం నుంచి చైనా సైనికుల రాకను చూచింది. అయితే మన సైనికులను చూడగానే పీకింగ్ సైనికులు, టిబెట్ భూభాగంలోనికి ఉపసంహరించుకున్నారు. ఉదయం 10 గంటలకు వచ్చిన వీరు సాయంత్రం ఆరు గంటలకు తిరిగి వెళ్ళిపోయారు.

బాహాటంగా జరిగిన ఈ సరిహద్దు అతిక్రమణ పట్ల భారతప్రభుత్వం నేడుపీకింగ్‌కు తన తీవ్రవిక్షేపణను తెలియజేసి ఇటువంటి కవ్వింపు చర్యలకు స్వస్తి జరిగేటట్టు చూడమని కోరింది.

కదిలిన అక్టోబరు 26వ తేదీ నుంచి ఈ నెల 19వ తేదీ వరకు చైనా సైనికులు నాలుగు సార్లు సిక్కిం సరిహద్దును ఉల్లంఘించారని ఇండియా పేర్కొని, అంతకంతకు ఎక్కువగా జరుగుతున్న ఈ కవ్వింపు చర్యలపట్ల తన తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసింది.

సెప్టెంబర్‌లో చైనా అల్టిమేటమ్ ఇచ్చినప్పటినుంచి చైనా సైనికులు సిక్కిం సరిహద్దులో పెద్ద సంఖ్యలో తిష్ట వేసుకొని వున్నారని, సరిహద్దులలో కవ్వింపు చర్యలకు పాల్పడడమే వారి లక్ష్యంగా వున్నట్టు కన్పిస్తున్నదని ఇండియా పేర్కొని, ఈచర్యలకు స్వస్తి జరిగేటట్టు చూడమని పీకింగ్‌ను కోరింది.

ప్రధానికి మద్రాసులో 97,500 గ్రాముల బంగారం సమర్పణ

మద్రాసు, నవంబర్ 21— ప్రధాని శ్రీ శాస్త్రి రెండు రోజుల పాటు ఇక్కడ గడిపిన సందర్భంలో ఆయనకు, ఆభరణాల రూపంలో 97,500 గ్రాముల బంగారాన్ని సమర్పించడం జరిగింది.

ఇందులో 94,000 గ్రాముల బంగారాన్ని బాండ్లపై పెట్టుబడిగాను, మిగిలినది రక్షణనిధికి విరాళంగాను సమర్పించడం జరిగింది. నిన్న రాత్రి మద్రాసు ముఖ్యమంత్రి సమర్పించిన రక్షణనిధి విరాళం 111 లక్షలు కాక, మరి 7.5 లక్షలు కూడ ఈ నిధికిగాను ప్రధానికి సమర్పించడం జరిగింది.

హెూస్పేటలో రెండవసారి అయిదుగురి అరెస్టు

రు 100 నకిలీ నోట్లతో సహా

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

బళ్ళారి, నవంబరు 22—ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక వ్యక్తితోపాటు బళ్ళారి జిల్లాకు చెందిన నలుగురు వ్యక్తులను మైసూరు రాష్ట్ర సి. ఐ. డి. శాఖవారు రూ 100 నకిలీ నోట్లతో సహా మొన్న హోస్పేటలో అరెస్టు చేశారు.

నకిలీ రు. 100 నోట్ల మారకంచేసే అంతర్రాష్ట్రీయ ముఠా ఉన్నదని "ఆంధ్రజ్యోతి" ఇటీవల ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే.

హోస్పేటలో రు. 100 నకిలీ నోట్లు మారకంచేసే వారిని అరెస్టుచేయడం ఇది రెండవసారి.

చెక్కుల ద్వారా జీతాల బట్వాడా

సులభపద్ధతి అని ఆదోనిలో డాక్టర్ పాయ్ సూచన

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

ఆదోని, నవంబర్ 22—ఇక్కడి శ్రీ వాసవీ కల్యాణ మందిరంలో ఇటీవల జరిగిన సభలో మాట్లాడుతూ "పద్మశ్రీ" డాక్టర్ టి. ఎం. ఎ. పాయ్ జీతాలు చెక్కుల ద్వారా బట్వాడా చేయడం సులభపద్ధతి అని, తద్వారా ప్రజలలో బ్యాంకింగ్ పద్ధతి అలవడుతుందని సూచించారు.

సభకు శ్రీ టి. జి. వి. గుప్త అధ్యక్షత వహించారు. శ్రీ గౌరా శ్రీరాములు వందన సమర్పణ గావించారు.

శ్రీ చైనానీ పరిస్థితి ఆందోళనకరం

బొంబాయి, నవంబర్ 21— వారం రోజుల క్రితం కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బొంబాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ హెచ్. కె. చైనానీ పరిస్థితి నేటి రాత్రి ప్రమాదకరంగా పరిణమించింది.

శ్రీ చైనాని గత కొన్ని రోజులుగా స్పృహ లేకుండా వున్నారు. ఆయనకు నేటి ఉదయంనుంచి జ్వరం తీవ్రమై 103 డిగ్రీలకు చేరిందని అనుపత్రి వర్గాలవారు తెలియజేశారు.

కాశీ విద్యార్థుల ఆందోళనపై రాజ్యసభలో చర్చ

న్యూఢిల్లీ, నవంబర్ 22— బెనారెస్ హిందూ యూనివర్శిటీ పేరు మార్పు సందర్భంలో గత ఆరు రోజులుగా వారణాసిలో విద్యార్థులు జరుపుతున్న ఆందోళన విషయం నేడు రాజ్యసభలో చర్చకు వచ్చింది.

బెదరింపుల ద్వారా ఆందోళనల ద్వారా పార్లమెంటులో పలుకుబడిని సంపాదించలేరని సభ్యులు చెప్పారు,

ఈ సమస్యపై నిర్ణయం చేయడంలో స్వేచ్ఛగా ఒటు చేయడానికి పార్లమెంటుకు వదలివేస్తానని విద్యామంత్రి శ్రీ చాగ్లా కార్ అచెన్సన్ మోహన్‌కు సమాధానంగాచెప్పారు. ఈ విషయాన్ని పరిశీలించడానికి విశేష కృషి చేయాలి."

హిందూమహాసముద్రంలో బ్రిటిష్ స్థావరం

పార్లమెంటరీ ప్రతినిధివర్గం నాయకుని సమర్థన

కలకత్తా, నవంబర్ 22— హిందూ మహాసముద్రంలో బ్రిటిష్ సైనిక స్థావరం ఏర్పాటుచేయడం చైనా ప్రమాదం ఎదుర్కొనడానికి సహాయపడగలదని బ్రిటిష్ పార్లమెంటరీ ప్రతినిధివర్గం నాయకులు మైకేల్ నోబెల్ నిన్న ఇక్కడ అన్నారు.

ఇండో-పాక్ సంఘర్షణపై బ్రిటన్ వైఖరి సమంజసమైనదని కూడా ఆయన అన్నారు. పత్రిక విలేకరులవల్ల ఇండియా సరిగా వ్యవహరించక పోవడంవల్ల బ్రిటిష్ ప్రజలలో ఏమిజరిగినది తెలియలేదట.

టిబెట్‌లో పౌరహక్కులు

చైనా వ్యవహరిస్తున్న తీరుపై శ్రీ స్వర్ణసింగ్ వివరణ

న్యూఢిల్లీ, నవంబర్ 22— టిబెట్‌లో పౌరులహక్కులు, స్వేచ్ఛవిషయాలలో చైనా వ్యవహరిస్తున్నతీరు మనకు తీవ్రమైన ఆందోళన కలిగిస్తున్నదని విదేశాంగ శాఖ మంత్రి శ్రీ స్వర్ణసింగ్ నేడు లోకసభలో చెప్పారు.

బహుళరాజ్యసమితిలో టిబెట్ సమస్యపై ఇండియావైఖరి విషయంలో వచ్చిన ప్రశ్నలకు ఆయన సమాధానంగా పై విషయం చెప్పారు.

చర్చి మిషనరీ సొసైటీ కార్యదర్శి డాక్టర్ జాన్ టేలర్ నవంబరు 21 వ తేదీన మాట్లాడుతూ, దూరప్రపంచంలో స్వత్వ, స్వత్వహీన వర్గాలమధ్య ప్రస్తుతం కానవస్తున్న విద్వేషపూరిత పరిస్థితికి సాంఘిక వికాసమే మూలకారణమని చెప్పినట్టు కొట్టాయం వార్త.

ఢిల్లీలో రష్యన్ స్టడీస్ ఇన్‌స్టిట్యూట్‌కు జ్యోతిని వెలిగించడం ద్వారా కేంద్రమంత్రి శ్రీ చాగ్లా, సోవియెట్ రష్యా విద్యామంత్రి శ్రీ ఎలూటిన్ ప్రారంభోత్సవం చేస్తున్న దృశ్యం

రక్షణనిధి దుబారా

ఉయ్యూరు గ్రామాధికార్లపై ఆరోపణలు: అవసరమైతే విచారణకు మంత్రి హామీ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్, నవంబరు 22— కృష్ణాజిల్లా ఉయ్యూరు గ్రామకరణం, మునసబు కలసి జాతీయ రక్షణనిధిని ఆరగించారని వచ్చిన ఆరోపణను గురించి శాసన సభ్యులు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య చేసిన ప్రశ్నకు సమాధానంగా ఘామిరెడ్డి వసూళ్ళకు సంబంధించి ఒక పద్దుకు బదులు ఒక పద్దుకు జమకట్టడం జరిగిందని రెవిన్యూ మంత్రి అన్నారు.

ఈ ఆరోపణకు సంబంధించి జరిగిన విచారణ పద్ధతిపై అనేక అనుబంధ ప్రశ్నలు వేయడం జరిగింది.

రెవిన్యూ డివిజనల్ అధికారు ఆ గ్రామానికివెళ్ళి విచారణ జరిపారని, ఈ విచారణకు సంబంధించి టాంటాం ద్వారా ప్రజల సాక్ష్యం చెప్పవలసిందిగా కోరారని, కాని ఎవ్వరూ రాలేదని మంత్రి తెలియజేశారు.

మునసబు రాజీనామా ఇచ్చాడని మంత్రి తెలియపరచినప్పుడు, సభ్యులు కొందరు తన బాధ్యతనుంచి తప్పుకోడానికి ఆ పని చేశాడా అని ప్రశ్నించారు.

కరణం, మునసబులు ఈ విషయంలో బాధ్యతవహించారని బుజువైతే రాజీనామా చేసినప్పటికీ వారిమీద చర్యలు తీసుకోబడతాయని మంత్రి తెలియజేశారు.

ప్రతిపక్షనాయకులు శ్రీ పిల్లలమర్రి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం రాజీనామాను ఆమోదించవద్దని, వారిమీద ఇంకా విచారణ జరిపించాలని అన్నారు. అవసరమైతే విచారణ జరపగలమని రెవిన్యూ మంత్రి తెలియజేశారు.

వ్యవసాయ కూలీ సహకార క్షేత్రాలలో కౌలు నిబంధనల ప్రకారం వాణిజ్యపంటలు పండించడానికి బిలుకాలేదని శ్రీయుతులు వంకా సత్యనారాయణ, పి. శ్యామసుందరరావుల ప్రశ్నకు సమాధానంగా రెవిన్యూ మంత్రి సమాధానం చెప్పారు. అధికాహారోత్పత్తిని సాధించడమే ఈ నిర్ణయం వెనకగల ముఖ్యోద్దేశమని ఆయన అన్నారు.

అనేకమంది సభ్యులు ప్రభుత్వం చూపే ఈ విషయంపట్ల తమ అసమ్మతి తెలియజేశారు. రెవిన్యూ బోర్డ్ ఈ విషయాన్ని పరిశీలించి, ఈ విషయంలో తొలగించాలని సిఫారసు చేసిందని, ఈ విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని రెవిన్యూ మంత్రి తెలియజేశారు.

ప్రభుత్వ ఉద్యోగి ఒకరికి కనికరదెస్సన్ మంజూరుచేసే విషయంపై అయిదుసంవత్సరాలనుంచి జాప్యం జరిగిందాఅని శ్రీడి.సీతారామయ్య వేసిన ప్రశ్నకు రెవిన్యూ మంత్రి అంగీకరించారు.

జాప్యానికి కారణం దానికి సంబంధించిన పత్రాలు దొరకలేవని ఇంతలో ఆ వ్యక్తి మరణించాడని మంత్రి అన్నారు.

దానికి వావిలాల మాట్లాడుతూఆ పెన్షన్‌ను ఆ చనిపోయిన వ్యక్తి భార్యకు ఆమె చనిపోక ముందు ఇస్తారా అని అన్నారు.

సింహళంనుంచి వచ్చిన శరణార్థులు నాలుగు సంవత్సరాల క్రితం నెలూరు జిల్లాలో కూర్పు గూడూరు గ్రామంలో పట్టాల మంజూరుకొరకు పెట్టుకుంటే ఇంతవరకు వాటిని గురించి అతీగతీలేదని శ్రీ చేమయ్య అన్నారు. ఈ ప్రశ్నకు సమాధానంగా సరైన పత్రాలు లేకపోవడంతోపాటు రెండు సంవత్సరాల క్రితం మాములకు పట్టాలివ్వకూడదనే నియమం ఉందని రెవిన్యూ మంత్రి తెలియజేశారు. అందువేత ఆలస్యమైందని ఆయన అన్నారు. ఇప్పుడు కొత్త అప్లికేషన్లు పరిశీలిస్తామని అన్నారు.

శ్రీ పి. రామచంద్రారెడ్డి ప్రశ్నకు సమాధానంగా పబ్లిక్ వర్క్స్ మంత్రి శ్రీ టి. వి. రాఘవులు ఖమ్మం-ఎల్లందు రోడ్డు నిర్మాణంలో చాలా ఆలస్యమైనమాట నిజమేనని ఒప్పుకున్నారు. 20,60,000 రూపాయలు ఈ రోడ్డుమీద ఖర్చుచేయబడ్డాయని ఒక మాసం రోజులలో ఈ రోడ్డుకు ప్రారంభోత్సవం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

సోనేనదిపై బరాజ్‌కు శ్రీ నందా ప్రారంభోత్సవం

సోనే (బీహార్), నవంబర్ 22—ఇక్కడకు సమీపంలో ఇంద్రపురివద్ద 4616 అడుగుల పొడవున సోనానదిపై నిర్మించిన పొడవైన బరాజ్‌కు నిన్న కేంద్ర హోం మంత్రి శ్రీ గుల్జారీలాల్ నందా ప్రారంభోత్సవం జరిపారు.

14 కోట్ల రూపాయలు వ్యయమైన ఈ బరాజ్ వల్ల మూడు లక్షల ఎకరాలు అదనంగా సాగులోకి వస్తాయి.

ఈ బరాజ్ నిర్మాణం 1962నవంబరులో ప్రారంభమై ఇటీవల పూర్తి అయింది.

పైర్లు దెబ్బతిన్న చోట్ల ధాన్యం లెవీలో మినహాయింపు

శాసనసభలో ముఖ్యమంత్రి హామీ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్, నవంబర్ 22— వర్షాభావానికి గురయిన మెట్టప్రాంతాలలో వ్యవసాయదారులనుంచి ప్రభుత్వం లెవీ పద్ధతిపై ధాన్యం వసూలు చేయడంలో మినహాయింపులు చేయగలమని శాసనసభలో రాష్ట్రముఖ్యమంత్రి శ్రీకాసు బ్రహ్మానందరెడ్డి నేడు హామీఇచ్చారు.

లెవీ చెల్లించవలసిందిగా ఇచ్చిన నోటీసుల విషయంలో ఆందోళన చెందవలసిన అవసరం లేదని ప్రతిపక్షసభ్యులకు ఆయన చెప్పారు.

ఉప్పత్తిదారులవద్ద ధాన్యం మిగులు ఉంటేనే లెవీ సమస్య ఉత్పన్నమవుతుందని పంటలు దెబ్బతిన్న ప్రాంతాలలో ఈసమస్య తలెత్తదని ఆయన అన్నారు.

లెవీ చెల్లించవసిందినిఅవిధంగాచెల్లించని పక్షంలోరక్షణ నిబంధనల కింద శిక్షిస్తామని నల్గొండ జిల్లా రైతులకు నోటీసులు జారీకాకోరని కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ అడుప్ల రామచంద్రారెడ్డి చెప్పారు.

దుర్భిక్ష పరిస్థితిపై చర్చ వెంటనే జరుపడంవల్ల రైతులనుగల ఇబ్బందులను తొలగించడంలో ప్రభుత్వానికి ఉపయోగంగా వుంటుందని శ్రీ వంకా సత్యనారాయణతో సహా పలువురు సభ్యులు కోరారు.

మునిసిపల్ ఎన్నికలను వాయిదా వేయడం వంటి ప్రాముఖ్యంలేని విషయాలను చర్చించడంకన్నా ఈ తీవ్ర సమస్యను సభవారు చర్చించడం సరియైనదని సోషలిస్టు సభ్యుడు శ్రీ టి. ఆర్. కె. శర్మ చెప్పారు. దుర్భిక్ష పరిస్థితులపై శాసనసభ చర్చిస్తుందని ప్రజలు ఆశతో చూస్తున్నప్పుడు మిగిలిన పార్టీల బిల్లును చర్చించడం ఉచితంకాదన్నారు.

రెవిన్యూబోర్డు కలెక్టర్లతో చర్చలు జరుపుతున్నదని, కొద్దిరోజులలో పరిస్థితి సమగ్రస్వరూపం తెలియగలదని ముఖ్యమంత్రి చెప్పారు. అందువల్ల దుర్భిక్ష పరిస్థితిపై వెంటనే చర్చించడానికి అవకాశం లేదన్నారు. రైతులకు నోటీసులు ఇచ్చిన విషయంలో ఆందోళన అవసరంలేదని, దుర్భిక్ష ప్రాంతాలలో లెవీ వసూలుచేస్తామని అర్థం కాదని ముఖ్యమంత్రి అన్నారు.

ఈ విషయంపై తన వాయిదా తీర్మానం ఏమైందని కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ ఎన్. ప్రసాదరావు సభాపతిని అడిగారు. 23 వ తేదీన కాల్‌అటెన్షన్ తీర్మానంచర్చకు వస్తుందని డిప్యూటీ స్పీకర్ శ్రీ వానుదేవనాయక్ చెప్పారు.

రాష్ట్ర శాసన సభచే రెండు బిల్లుల ఆమోదం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, నవంబర్ 22— ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసు సవరణ బిల్లు, ఆంధ్రప్రదేశ్ డబ్బు చలామణి పత్రకం బిల్లు నేడిక్కడ జరిగిన రాష్ట్ర శాసన సభ సమావేశంలో ఆమోదించబడినవి.

ఆంధ్రప్రదేశ్ కోపరేటివ్ సొసైటీలసవరణ బిల్లు, ఆంధ్ర ప్రదేశ్ కోపరేటివ్ సొసైటీల (రెండవ సవరణ) బిల్లును, ఆంధ్రప్రదేశ్ మునిసిపాలిటీల (ఎన్నికల వాయిదా) బిల్లును ప్రాంతీయకమిటీ పరిశీలనకు పంపారు.

శ్రీ ఎన్. ప్రసాదరావు, శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యలతోసహా ప్రతిపక్షసభ్యులు, మరికొంత మంది సభ్యులు ఆంధ్ర ప్రదేశ్ సివిల్ సర్వీసుల (క్రమశిక్షణ చర్యల (ట్రిబ్యునల్) సవరణ బిల్లువల్ల తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ సవరణబిల్లు వాస్తవానికి హైకోర్టు తీర్పును ఉల్లంఘించేదిగా వున్నదని వారు చెప్పారు.

బిల్లును ప్రతిపాదించిన ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి, ట్రిబ్యునల్‌లోని ఒక సభ్యుడు ఒక కేసును విచారించి సాక్ష్యాన్ని నమోదుచేసి తాను నిర్ణయం చేసిన తర్వాత, ట్రిబ్యునల్‌లోనిమిగతా సభ్యులనుకూడాఆనిర్ణయాన్ని ఆమోదించాలని కోరడం సముచితం కాదని వివరించారు.

ట్రిబ్యునల్‌లోని ఒక సభ్యుడు ఒకకేసుపై తీర్పు ఇచ్చినప్పుడు దానిని ట్రిబ్యునల్ తీర్పుగా ప్రభుత్వానికి నివేదించడానికి ముందు ట్రిబ్యునల్‌లోని ఇతర సభ్యుల సంతకాలుకూడా దానిపై తప్పక వుండాలని హైకోర్టు తీర్పుఇచ్చింది.

హైకోర్టు తీర్పు "అసాధారణమైన" కేసులకు సంబంధించినదని కేసు విచారణలోగాని, సాక్ష్యసేకరణలోగాని పాల్గొనని ఇతరసభ్యుల అంగీకారం వుండాలని కోరడం సముచితంకాదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

శ్రీ సిద్దయ్య కవికి వేటపాలెంలో సన్మానం

వేటపాలెం, నవంబర్ 22 -స్థానిక బండ్ల బాపయ్య హిందూ హయ్యర్ సెకండరీ స్కూల్ వారి ఆధ్వర్యాన 17వ తేదీ సాయంత్రం పాఠశాల ఆవరణలో చిలకలూరిపేట వాస్తవ్యులు శ్రీ ఎస్. సిద్దయ్య కవికి సన్మానం జరిగినది. సభకు శ్రీ బండ్ల సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. శ్రీ నందుల శేషగిరి శర్మ ప్రార్థన చేశారు. ప్రధానోపాధ్యాయులు శ్రీ నాసిక మల్లిఖార్జునరావు కవిని పరిచయం చేశారు.

యూనివర్శిటీలబిల్లు

(1వ పేజీ తరువాయి)

జరుగుతుందని భావించడం ఉచితం కాదని ఆయన అన్నారు.

గతానుభవాన్ని బట్టి వైస్‌ఛాన్సలర్ల నియామకానికి పేనల్ పద్ధతి వ్యర్థమని రుజువైనదని ఆయన వివరించారు.

ఈ బిల్లుద్వారా విశ్వవిద్యాలయ సంఘాలలో విద్యాపేత్తల ప్రాబల్యాన్ని తగ్గించే ప్రయత్నం జరుగుతున్నదన్న ఆరోపణను ఆయన ఖండించారు.

శ్రీ గోవిందరాజులు విమర్శ

శ్రీ గోవిందరాజులు నాయుడు బిల్లులను నిశితంగా విమర్శించారు. విశ్వవిద్యాలయాల స్వతంత్ర ప్రతిపత్తికి ఈబిల్లులు నాందీవాచకం పలుకగలవని, రేపు సాయంత్రానికి విశ్వవిద్యాలయాలు మృతప్రాయమైపోగలవని అన్నారు. విశ్వవిద్యాలయం అన్న మాటను నామక ప్రపంచం ఏ అర్థంతో అవగాహన చేసుకుంటున్నదో ఆ అర్థం ఈ బిల్లుల అనంతరం మృగ్యమైపోగలదని ఆయన వివరించారు.

అసలు యూనివర్శిటీ చట్టాలను ఎందుకు సవరించవలసివచ్చిందని శ్రీ గోవిందరాజులు నాయుడు ప్రశ్నించగా "ఎందుకు వివరించరాదు"? అని న్యాయశాఖ మంత్రి ఎదురు ప్రశ్నవేశారు.

శ్రీ గోవిందరాజులునాయుడు: సూతిలో దూకవద్దని సలహా ఇచ్చినప్పుడు "ఎందుకు దూకరాదు?" అని మీరు ఎదురుప్రశ్న వేశారు.

శ్రీ నరసింహారావు: చట్టాన్ని చేయడాన్ని సూతిలో దూకడంతో పోలిస్తే నేను చేయగలిగింది ఏమీలేదు. నేను ఈ వైఖరికి విచారిస్తున్నానని మాత్రమే చెప్పగలను.

శ్రీనాయుడు: ఈ బిల్లులు భేదవి, ఆత్మహత్యా సదృశ్యమైనవి.

మంత్రి నరసింహారావు జవాబిస్తూ పరస్పర విమర్శలవల్ల ప్రయోజనం పుండదని, ప్రతిపక్షాల విమర్శలను ఎంత శ్రద్ధగా తాను పరిశీలిస్తున్నా ఒక్క సూచనకూడా కన్పించలేదని అన్నారు.

బిల్లులను వాయిదా వేయడంకాని, వైస్ ఛాన్సలర్ల నియామకం విధానంలో ప్రధానమైన మార్పులకు ప్రభుత్వం సమ్మతించడం కాని జరగదని శ్రీ నరసింహారావు స్పష్టం చేశారు. ఈ అంశాలు మినహా మిగిలిన అంశాలపై సభ్యులు ఏవైనాసూచనలు చేస్తే వాటిని ప్రభుత్వం పరిశీలించగలదని ఆయన హామీ నిచ్చారు.

శ్రీ కొత్తారి, శ్రీ సి. పి. రామస్వామి అయ్యర్ పంపిన లేఖను, టెలిగ్రామును మంత్రి ప్రస్తావించి ఈ బిల్లులు మూడు నెలలుగా శాసనసభ పరిశీలనలో వున్నా మూడు రోజుల క్రితమే వారు వాటిని గుర్తించినట్టున్నదని అన్నారు.

చట్టాలను సవరించడం ద్వారా లేక విశ్వవిద్యాలయాల వ్యవహారాలలో లోపాల సవరణను ప్రభుత్వం ఇతర విధానాలను అనుసరించి పుండవలసిందని శ్రీ సీతారామరెడ్డి అన్నారు. ఆ ఇతర విధానాలేమిటో సూచించమని మంత్రి నరసింహారావు ఆయనను కోరగా, ప్రభుత్వం ఆర్డినెన్సును జారీచేసివుండవలసిందనిలయినజవాబిచ్చారు. విశ్వవిద్యాలయాలలో ఏదో లోపం కన్పించినప్పుడల్లా ఆర్డినెన్సులను జారీచేస్తూ పోవడం ప్రభుత్వానికి సాధ్యంకాదని మంత్రి నరసింహారావు జవాబిచ్చారు.

శ్రీ సుబ్రహ్మణ్యం శ్రీమతి ద్రోణంరాజు శ్రీలక్ష్మి దాయమ్మ, శ్రీ రంగారెడ్డి, శ్రీరామమూర్తి ప్రసంగించిన అనంతరం సభ రేపటికి వాయిదా పడింది.

సెనెట్ విజ్ఞప్తి

(1 వ పేజీ తరువాయి)

పదవీ కాలం ముగిసేవరకు ప్రభుత్వం చేరవుండాలని కోరాడు.

చర్చను ప్రారంభించిన శ్రీ వి. వి. రాజగోపాల్ గతఅక్టోబర్ 30 వ తేదీన సెనెట్ సమావేశం జరిపిన తర్వాత వచ్చిన పరిణామాలను వివరించారు.

బిల్లుపై కేంద్ర విద్యామంత్రి శ్రీ చాగ్లా తదితర విద్యావేత్తలు వైదనస్వభావాన్ని ప్రకటించారని డాక్టర్ టి. ఎస్. చెల్కోపే పేర్కొన్నారు. తాను సెనెట్ ఉప సంఘంలోని ఇతర సభ్యులతో కలసి ఢిల్లీ వెళ్ళి ఈ బిల్లును గురించి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాన మంత్రులనుకలుసుకుని చర్చించామని డాక్టర్ చెల్కోపే తెలిపారు.

బిల్లు విషయంలో శాసన మండలిలో నేటి ఉదయం జరిగిన కార్యక్రమం విశేషాలను శ్రీ వి. పి. రామచారి వివరించారు.

బిల్లును వ్యతిరేకిస్తున్నవారికి పిలో దురుద్దేశాలున్నట్టు ముఖ్యమంత్రి ఆరోపించడం దురదృష్టకరమని ఆయన అన్నారు.

సూడాన్‌లో కమ్యూనిస్టుపార్టీపై నిషేధానికి చర్య

ఖార్టూమ్‌లో పోటీ ప్రదర్శనలు

ఖార్టూమ్, నవంబరు 22—సూడాన్‌లో కమ్యూనిస్టుపార్టీపై నిషేధాన్ని విధించే ప్రతిపాదన విషయమై ముస్లింలు నిన్న దౌర్జన్య పద్ధతులపై పోటీ ప్రదర్శనలు జరిపారు. వాటిని పోలీసులు నిరోధించి నెరవగొట్టారు.

ఈ సందర్భంలో జరిగిన ఘర్షణలలో కనీసం 600 మంది గాయపడ్డారు. 50 మందిపైగా నిర్బంధితులైనారు.

శాంతి పునరుద్ధరణకు ఎట్టి చర్యలైనా గైకొనడానికి తన ప్రభుత్వం వెనుకాడబోదని సూడాన్ ప్రధాని రేడియోలో ప్రసంగిస్తూ హెచ్చరించారు.

ఒక ఏడాదిక్రితం జనరల్ అబ్బేద్ నియంతృత్వం పతనమైన నాటినుంచి పట్టబడ్డమైన తర్జనభర్జనల్ని కమ్యూనిస్టుపార్టీని నిషేధించే పాళ్లను దుస్థితిలో బలపరుస్తున్నారు.

అర్థగేరిలో శ్రీమతి హెచ్. రామలక్ష్మమ్మ మృతి

ఆదోని, నవంబర్ 22— ఆంధ్రప్రదేశ్ సర్వీస్ కమిషన్ సభ్యులు, శ్రీ హెచ్. రామలింగారెడ్డి భార్య శ్రీమతి రామలక్ష్మమ్మ అర్థగేరిలోగల తమ స్వగృహంలో 16వ తేదీ ఉదయం మృతిచెందారు. వీరికి ముగ్గురు కుమార్తెలు వున్నారు.

శ్రీమతి రామలక్ష్మమ్మ మృతికి ఆదోని పత్రికా విలేకరుల సంఘంవారు తమ సానుభూతిని శ్రీ రామలింగారెడ్డికి అందజేశారు.

'దురాక్రమణను మనం ఎంతమాత్రం సహించం'

రాష్ట్రపతి రాధాకృష్ణన్ స్పష్టీకరణ

వారణాసి, నవంబర్ 21— భారతీయులు శాంతికాముకులని, తమంత తాముగా యుద్ధాలు చేయాలని ఎన్నడూ కోరుకొనరని, అంతమాత్రంచేత తమపై దురాక్రమణ జరిగితే సహించబోరని రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్ నే డిక్కడ వక్కాణించారు.

తన గౌరవార్థం నే డిక్కడ జరిగిన పౌరసన్మాన సభలో శ్రీ రాధాకృష్ణన్ ప్రసంగిస్తూ పై విధంగా చెప్పారు.

ఆయన ఈ సందర్భంలో ఇంకా ఇలా పేర్కొన్నారు: "ఏ సమస్యకు యుద్ధాలు పరిష్కారమార్గం కావు. యుద్ధాలు ఉభయ పక్షాలను వినాశానికి దారి తీస్తాయి. అందుచేత అన్ని అంతర్జాతీయ సమస్యలను ఆచరణ సాధ్యమైనంతవరకు సంప్రతింపుల ద్వారాను, పరస్పర సదవగాహనతోను, తదితర శాంతియుత మార్గాలద్వారాను పరిష్కరించాలి,

"ఇండో- పాక్ వివాదంకూడా త్వరలోనే సమసి పోగలదని ఆశిస్తున్నాను ఇండో-పాక్ సంఘర్షణను దీర్ఘ కాలం కొనసాగించరాదు.

"ఇండియా సర్వదాశాంతి ప్రియదేశం. మనం యుద్ధాన్ని ఎన్నడూ కోరము. మన సమస్యల పరిష్కారానికి యుద్ధం సాధనమని కూడా మనం పరిగణించడంలేదు కాని యుద్ధం ఏవైపునుంచి అయినా మనపైకి వస్తే మనం భయపడి పారిపోము. దాన్ని ధైర్యంగా ఎదుర్కొంటాము,

"తన భూభాగాన్ని రక్షించు కొనగలిగినంత పటిష్టంగా ఇండియా ఈనాడున్నది. ఇటీవల పాకిస్తాన్ దురాక్రమణ జరిపిన సందర్భంలో ఈ విషయం రుజువైంది. దురాక్రమణను ప్రతిఘటించడంలో మన జవాన్‌లు నిర్వహించినపాత్ర అపూర్వమైనది. తమ వీరోచిత పోరాటంద్వారా ఎట్టి త్యాగాలకైనా సిద్ధపడి దేశాన్ని రక్షించుకొనగలమని మన జవాన్‌లు ప్రపంచానికి చాటి చెప్పారు. ప్రపంచ దృష్టిలో మనదేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేసిన యోధులను కలిగి వున్నందుకు జాతి గర్వపడుతున్నది.

"1962 నుంచి ఇండియా క్లిష్ట స్థితిని ఎదుర్కొంటున్నది. దానికి తోడు పాకిస్తాన్ ఇటీవల మనపై దండయాత్ర చేసింది. అయినా మనం నిరుత్సాహపడలేదు. పాకిస్తాన్‌తో మనసంబంధాలు మెరుగుపడ, రెండు దేశాలు నిజమైన పొరుగు దేశాలుగా మనగలవని ఆశిస్తున్నాను,

"ప్రజలు తమ చర్యలను పునః పరిశీలించుకుంటూ విశ్వాస పాత్రంగా తమ కర్తవ్యాలను నిర్వర్తించాలి. ఈ విషయంలో బుద్ధుడు శంకరాచార్యుల వంటి మహనీయుల ప్రబోధాలను మననం చేసుకొనాలి.

"భారతదేశ ప్రాచీన సంప్రదాయాలను, సంస్కృతిని, ఔన్నత్యాన్ని పునర్వికసింపచేయడానికి విశేష కృషి చేయాలి."

రోటరీ ఉద్యమం ఉదాత్త లక్ష్యాలు

—శ్రీ కె. ఎస్. దత్తు వివరణ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) విజయవాడ, నవంబర్ 21— ఆరు లక్షల రూపాయల విలువగల వైద్య పరికరాలు అమెరికన్ రోటరీ సంస్థలనుంచి బహుమతిగా వస్తున్నట్టు రోటరీ గవర్నర్ శ్రీ కె. ఎస్. దత్తు నే డిక్కడ వెల్లడించారు.

అమెరికన్ రోటరీలు బహూకరించిన వైద్య పరికరాలలో శస్త్ర చికిత్సకు వినియోగించే సాధన సంపత్తితో పాటు ప్రాణవాయువు రోగికి అందజేసే పరికరాలతో అన్ని హంగులతోను సమకూర్చిన అంబులెన్స్ కూడా జనవరి నెలాఖరకు ఇండియా చేరడం సంభవమని శ్రీదత్తు పేర్కొంటూ, అంతర్జాతీయ సహకారానికి ఈ విధమైన సుహృద్భావం, ఉదార వైఖరి శత సహస్ర రూపాలలో ఆవిష్కృతం అయ్యే ఉదంతాలు చాల వున్నట్టు తెలిపారు.

రోటరీ ఉద్యమ విశిష్ట, మౌలిక లక్ష్యాలు, సాంఘిక సేవలో స్వచ్ఛంద సంస్థలలో దానికి వున్న అగ్రస్థానం, ప్రపంచ శాంతి, సుహృద్భావం, మైత్రి, వివిధ దేశాలు, జాతులు, సంస్కృతులు భిన్న సమాజాల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడంలో దానివి లక్షణపాత్రను గురించి శ్రీ కె. ఎస్. దత్తు నేటి రోటరీ సమావేశంలో ఆత్మపరిశీలన రోజుపై విధానికి సంబంధించిన ప్రధాన ప్రసంగం చేశారు.

1905లో పా

రాష్ట్రంలో అనావృష్టి పరిస్థితి:

"ఋణాలు, శిస్తుల వసూళ్లు నిలిపివేయాలి"

ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళన్ అభ్యర్థన

విజయవాడ, నవంబర్ 22—

అనావృష్టి ఫలితంగా రాష్ట్రంలో ఇటీవల ఏర్పడిన క్లిష్ట పరిస్థితుల దృష్ట్యా రైతులవద్ద ఋణాలు, శిస్తుల వసూళ్లను నిలిపివేయవలెనని మొన్న ఇక్కడ జరిగిన ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళన్ కార్యవర్గ అత్యవసర సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినది.

సమావేశానికి ప్రెసిడెంట్ శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్య అధ్యక్షత వహించారు.

కరవు ప్రాంతాలకు సబ్సిడీ ద్వారా చౌక ధాన్యం సరఫరా చేయవలెనని, చిన్ననీటి పారుదల సౌకర్యాలు కల్పించవలెనని, మూడవ పంటగా ఆహారధాన్యాలు పండించవలెనని అందుకు విత్తనాలు ప్రభుత్వమే సరఫరా చేయవలెనని, పశుగ్రాసం కొరతను నివారించవలెనని కూడా సమావేశం అభ్యర్థించినది.

వ్యాపార పంటలపై నిర్మాంధం తొలగించవలెనని, ప్రభుత్వం వ్యాపారరంగంలో ప్రవేశించరాదని, రైతుకు గిట్టుబాటు ధరలు వుండవలెనని, స్వేచ్ఛావ్యాపారం వుండవలెనని, రాజ్యాంగం 17వ సవరణను రద్దుపరచాలని సమావేశంలో తీర్మానించారు.

అనుమతిలేని సాగు చేసి పెనాల్టీలకు గురికావద్దని డెల్టా రైతాంగాన్ని సమావేశం హెచ్చరించినది.

మందసా

టెక్కలి, నవంబర్ 22— శ్రీకాకుళం జిల్లా సోంపేట తాలూకా కాంగ్రెస్ కార్యకర్తల ప్రత్యేక సమావేశం మందసాలో మొన్న శ్రీ వడ్డి భీమరాజు అధ్యక్షతన జరిగినది. తాలూకా కాంగ్రెస్ అగ్రనైజర్ శ్రీ మజ్జి తులసీదాసు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రత్యేక ఆహ్వానంపై టెక్కలి డివిజనల్ ఇరిగేషన్ మహాసభ అధ్యక్షులు శ్రీ బి. ఎం. రెడ్డి, పలాసా ఫిర్కా రైతు కాంగ్రెస్ నాయకులు శ్రీ పేరికట్ల నారాయణ హాజరయారు. శ్రీయుతులు సానా వీరభద్రరావు, సిందిరి రామస్వామి, డాక్టర్ బి.ఎస్. నారాయణ, కె. అబ్బాయి నాయుడు ప్రభృతులు సమావేశంలో ప్రసంగించారు.

తాలూకాలోగల జలాశయాలను సత్వరమే పునరుద్ధరించవలెనని, టిపీ విధానం వర్తింపులు పంట రాలుబడి దామాషా పద్ధతి అనుసరించవలెనని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.

పాకాల

వరంగల్లు, నవంబర్ 20— అనావృష్టి వల్ల చరిత్ర ప్రసిద్ధమైన పాకాల చెరువుకింద పైరులు సత్వరంగా మాడిపోతున్నాయి.

నరసంపేట, పాకాల, అశోక్‌నగర్, గూడూరు, మహబూబాబాద్, మొగిలిచర్ల, బేతోల్, కొర్పి, మరిపాడ ప్రాంతాలలో పైరులు పూర్తిగా దెబ్బతిన్నాయి.

రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ శివరామప్రసాద్ ఇటీవల జిల్లా కలెక్టర్ శ్రీ ఎం.ఎ. హలీమ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ వెంకటరెడ్డితో పర్యటించినప్పుడు ఈ ప్రాంతమంతా నిరుత్సాహంగా కనపడింది.

ఈ ప్రాంతాల సమితి అధ్యక్షులు తక్షణమే ప్రభుత్వం సహాయ కార్యక్రమాలు చేపట్టాలని, శస్తు రెమిషన్ ఇప్పించవలెనని, తక్కావీ ఋణాల వసూలు ఆపాలని, చౌకమకాణాలు తెరవాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం తక్షణమే సహాయ కార్యక్రమాలు ప్రారంభించగలదని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

ఒంగోలు తాలూకా

ఒంగోలు, నవంబర్ 22—ఈ తాలూకా పైరుపైర్లు, పొగాకుపై ఆధారపడినప్రాంతం. వర్ష ఋతువులైన హస్త, చిత్త, స్వాతి, విశాఖ కార్తెలలో ఒక్కబొట్టయినా వర్షబిందువు పడలేదు. దానితో వ్యాపార పంట అయిన పొగాకు ఇప్పటికీ పడలేదు.

పైర పైరులయిన జొన్న, వరిగ పదును లేక చేయడం జరగలేదు. కొందరు గొర్రె అద్దలపై ఇసుక బస్తాలు బరువుపెట్టి వేసినా రేమ అందక గడ్డలలో నుంచి మొక్క బయటికి రాలేదు. ముదురు జొన్న, కందికూడా వర్షం లేక ఎండిపోయాయి.

మానాణి చెరువులలో నీరు లేక ఎండిపోయిన పైర్లను పశువులకు మేపారు. కూలీలు పనులకు పిలవేవారులేక ఇక్కడి నుంచి వలసపోతున్నారు. వున్నదబ్బు పెట్టి, ఎక్కువవడ్డీలతో తెచ్చిన డబ్బుతో ఎరువులు కొని, ఆ ఎరువులూకూడా చేలలో వేసుకొనక ఏమీ చేయను దిక్కుతోచక దీనవదనాలతో, గుడ్ల నీరు క్రుక్కుకొంటూ రైతాంగం కనపడిస్తున్నారు.

తాలూకా ఒక్క చెరువులో అయినా త్రాగడానికి దోసెడు నీరుకూడా లభ్యమవడం లేదు. తాలూకా ప్రజలు నేడు త్రాగడానికి నీరు, తినడానికి తిండి, చేయడానికి పని లేక పొలంలో పైరు పడక నానా అవస్థలకు లోనవుతున్నారు.

పశ్చిమగోదావరి

తాడేపల్లిగూడెం, నవంబర్ 22—పడాల, ఉప్పాడపాడు, ప్రత్తిపాడు, అలంపురం, దువ్వ, ముద్దాపురం, రావిపాడు, బి.కొండేపాడు మొదలైన పల్లపుభూములలో అక్షుల్లు, సన్నకృష్ణకుటుకల ధాన్యం గత పదేళ్ళలో ఎన్నడు లేనంత ఎక్కువగా పండింది. ప్రకృతి దెబ్బకు అభయం ఇచ్చినట్టుంది. గత పది ఏండ్లలో ఎప్పుడు ముంపుకు గురి అయ్యే ప్రాంతాలలో ఈ సంవత్సరం ముంపు లేకపోవడమే ఇందుకు కారణం.

గణపవరం సమితి ఏరియాలో ఏగ్రామం లేనంత అధ్వాన్నంగా బి. కొండేపాడు ఉంది. యనమదుర్రు మురుగుకాల్వపై వంతెన నిర్మాణం అత్యవసరం. రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ శ్రీసత్యనారాయణమూర్తి పంటనరయిన అంచనాలువేసి రైతులుకూడా అశ్చర్యపడేటట్టు చేశారు. రైతులఇబ్బందులు ఆయన పూర్తిగా విన్నారు. నీటిపారుదల, మరమ్మతు ఇంజనీరింగ్ శాఖవారు కూడా పలుప్రాంతాలు పర్యటించి అవసరాలు గుర్తిస్తున్నట్టు తెలుస్తున్నది.

ఈ తాలూకా నల్లజర్ల పంచాయతీ సమితిలో వెల్లమిల్లి, కొండ్రుపోలు, కాడియద్ద, కొమ్ముగూడెం, అప్పారావుపేట, వీరంపాలెం, తెలిరవర్ల, వెంకటరామన్నగూడెం మొదలయిన గ్రామాలలో అధికారులు సర్యటించారు. కొండ్రుపోలు గ్రామపంచాయతీ అధ్యక్షులు శ్రీ తల్లాప్రగడ జగన్మోహనరావు అధికార్లకు ఇక్కడి పరిస్థితులు వివరిస్తూ అనావృష్టికారణంగా అపరాలు మొలకెత్తలేవని, పశుగ్రాసం కొరత ఏర్పడినదని, మైనర్ ఇరిగేషన్ చెర్వులు ఎండిపోయాయని, కొన్ని చెర్వులలో నీరు సంక్రాంతి తర్వాత లభించేటు లేదన్నారు. సహాయ కార్యక్రమం ప్రారంభించడంతోపాటు ఆ చెర్వులన్నిటా ఆర్టిసన్ గొట్టపు బావులు వేయడం అత్యవసరమన్నారు.

కొమ్ముగూడెంలో సర్వశ్రీ వట్టికూటి వెంకటరామారావు, (నల్లజర్ల సమితి అధ్యక్షులున, నడింపల్లి సూర్యనారాయణరాజు (బి. డి. ఓ) మెట్టగ్రామాల దుస్థితి వివరించారు. మనుషులకు, పశువులకు తిండి, నీరు లేని దుస్థితి వివరించి కొన్ని కార్యక్రమాలు సూచించారు.

ప్రభుత్వం జిల్లా అంతటా, ముఖ్యంగా మెట్ట ప్రాంతాలలో రైతాంగానికి అవసరమైన చర్యలు తీసుకోడం అత్యవసరంగా కన్పిస్తుంది. యుద్ధకాలపు సరళిలో ప్రవర్తించకుంటేజిల్లా గొడ్డుపోకతప్పదు. ధరలు అదుపుచేయడం, వర్తకులు కరవు సృష్టించకుండా చూడడం తక్షణ కర్తవ్యం.

చింతలపూడి తాలూకా సగంలో ఇప్పుడే దుర్భిక్షంగా ఉందని అధికారికంగా తెలుస్తున్నది. తాడేపల్లిగూడెం పట్నంలో మళ్ళీ బియ్యం వినియోగదార్లకు పర్మిట్‌పై అమ్మే సౌకర్యం ఏర్పరచినట్టు అసిస్టెంట్ కైన్ ఎర్పేజింగ్ ఆఫీసర్ శ్రీ చిత్రపు వరదరాజు చెప్పారు.

పురపాలక మంత్రికి పౌరసన్మానం

తాడేపల్లిగూడెంలో

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

తాడేపల్లిగూడెం, నవంబర్ 22—ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖమంత్రి శ్రీ నలమోతు చెంచురామానాయుడు ఇక్కడకు వచ్చిన సందర్భంలో మొన్న స్థానిక పురపాలక సంఘం పౌర సన్మానంచేసినది. మంత్రికి స్వాగతమిచ్చిన వారిలో పురపాలక సంఘాధ్యక్షులు డాక్టర్ కోడే వేంకటరావు, కార్యదర్శి శ్రీ జి. వేంకటరావు, ఆర్. డి. ఓ. శ్రీ పి. సత్యనారాయణమూర్తి ప్రభృతులు వున్నారు.

ఈ సందర్భంలో జరిగిన సభకు అధ్యక్షత వహించిన జిల్లా కాంగ్రెస్ ప్రెసిడెంట్ శ్రీ అల్లూరి బాపినీడు పట్టణాభివృద్ధి అయన సృష్టికి తెచ్చారు. మంత్రి వెంట సర్వశ్రీ ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్, కొమ్మారెడ్డి సూర్యనారాయణ ప్రభృతులు కూడా వచ్చారు.

విజయవాడ మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ వార్షికోత్సవం

విజయవాడ, నవంబర్ 22—విజయవాడ మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం నిన్న ఉదయం దుర్గా భవన్‌లో శ్రీ ఎస్. ఎస్. కె. స్వామి అధ్యక్షతన జరిగింది.

మద్రాస్ మోటార్ విడిపరికరాల వ్యాపారస్తుల సంఘం అధ్యక్షులు శ్రీ ఎస్. నారాయణ సభను ప్రారంభిస్తూ మోటార్ పరిశ్రమపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు అధికంగా వేస్తున్నాయని అన్నారు.

విడి పరికరాలను సరసమైన ధరలకు అమ్మాలని, నకిలీ పరికరాల వాడకంవల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం కలదని శ్రీ నారాయణ అన్నారు.

సంఘం కార్యదర్శి శ్రీ హర్భన్‌సింగ్ నివేదిక సమర్పించారు.

విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి శ్రీయుతులు సోమరాజు ఆంజనేయులు పంతులు, సంగత్ సింగ్, బి.వి. రాఘవయ్య, పెండ్యాలరావు ప్రభృతులుప్రసంగించారు. సంఘం అధ్యక్షులు శ్రీకుశలవ వందన సమర్పణచేశారు.

వివాహ మహోత్సవాలు

రాజోలు, నవంబర్ 22 — రాజోలు శ్రీ నున్న నారాయణస్వామి మనుమడు చిరంజీవి నారాయణ స్వామికి శివకోడుకాపరస్తులు శ్రీ కనుమర్తి నారాయణమూర్తి కుమార్తె సౌభాగ్యవతి చంద్ర కాంతరను ఇచ్చి మొన్న శివకోడు పాలెం కన్యాదాన స్వగృహంలో వైభవోపేతంగా వివాహ మహోత్సవం జరిపారు.

* * *

నిడదవోలు, నవంబర్ 22 — ఇక్కడ పరవ తేదీన ఎస్. వి. ఎస్. జోగయ్య ద్వితీయ పుత్రిక సౌభాగ్యవతి వెంకట్రామ సత్యవతిని లంకలకోడేరు వాస్తవ్యులు శ్రీ చావలి సూర్యనారాయణ కుమారుడు చిరంజీవి లక్ష్మీనరసింహం సుబ్బరాయశర్మకు ఇచ్చి వైభవోపేతంగా వివాహ మహోత్సవం జరిపించారు.

* * *

మంగళగిరి, నవంబర్22 —శ్రీ ఇంటూరి కృష్ణమూర్తి కుమార్తె సౌభాగ్యవతి నాగమణికి అన్నవరం వాస్తవ్యులు శ్రీ మాదిరాజు కాంతయ్య ద్వితీయ కుమారుడు చిరంజీవి సత్యనారాయణకు15 వ తేదీన వివాహం శ్రీ లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో జరిగినది.

మద్రాసు కళాకారుల బృందంవారు గుంటూరులో నృత్యప్రదర్శన లిచ్చి నప్పుడు జిల్లా పరిషత్తు చైర్మన్ శ్రీ మేడూరి నాగేశ్వరరావు వారిని అభినందిస్తూ ప్రసంగిస్తున్న దృశ్యం

సెంట్రల్ డెల్టాలో సమష్టి సాగుకు పైలట్ ప్రాజెక్ట్

—రాజోలు సమావేశంలో వివరణ

("ఆంధ్రజ్యోతి" విలేకరి) రాజోలు, నవంబర్ 22 —

సెంట్రల్ డెల్టాలోని 210 వ్యవసాయ పనివారల సహకార సంఘాలను 135 సమష్టి వ్యవసాయ పనివారల సహకార సంఘాలుగా పునర్నిర్మించారు.

రాజోలు, కొత్తపేట, అమలాపురం తాలూకాలలోగల 11 వేల ఎకరాల ప్రభుత్వ లంకభూములను ఆ సంఘాలకు దీర్ఘకాలిక ప్రాతిపదికపై కౌలుకు ఇవ్వడానికి ప్రభుత్వం రూపొందించిన పైలట్‌స్కీమ్ అమలు జరపడానికిగాను అమలాపురం డిప్యూటీరిజిస్ట్రార్ శ్రీ డి. జె. సుభాకరరావు రాజోలు తాలూకాలోని ఫీల్డ్‌లేబర్, వివిధ వ్యవసాయ పనివారల సహకార సంఘాల అధ్యక్షులు, ప్రతినిధుల సమావేశం మొన్న ఇక్కడ ఏర్పాటు చేశారు. సమావేశానికి శ్రీ నున్న నారాయణరావు అధ్యక్షత వహించారు. శ్రీ వై. రామచంద్రరావు సమావేశాన్ని ప్రారంభించారు.

డిప్యూటీ రిజిస్ట్రార్ "పైలట్ ప్రాజెక్ట్"ను కూలంకషంగా వివరించారు. శ్రీయుతులు చెల్లుబోయిన సత్యనారాయణ, నీతిపూడి గణపతిరావు, సి. నరసింహారావు, రత్నం ప్రభృతులు మాట్లాడారు.

కోనసీమలో బృహత్పరిణామాలకు అవకాశం జరపడానికి పూనుకొన్న ప్రభుత్వాన్ని, విశేష శ్రద్ధ తీసికొన్న సహకారమంత్రి శ్రీ తోట రామస్వామి, కేంద్ర ఉపమంత్రి శ్రీ బి.ఎన్. మూర్తికి కృతజ్ఞతలు తెలుపుతూ సభలో తీర్మానం ఆమోదించారు.

ఆంధ్రప్రదేశ్ శాంతి మహాసభ

వచ్చేనెల 18,19 తేదీలలో నిడదవోలులో జరుప నిర్ణయం

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

నిడదవోలు, నవంబర్ 22— ఆంధ్రప్రదేశ్ శాంతిసంఘం కార్యదర్శి డాక్టర్ బి.వి ఎస్.ఎస్. రాజు నేడొక ప్రకటనచేస్తూ ప్రదేశ్ శాంతిసంఘం మహాసభ వచ్చేనెల 18,19 తేదీలలో రెండురోజులపాటు పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలులో జరపడానికి నిర్ణయించినట్టు తెలియచేశారు.

ఈ సందర్భంలో జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీ వి.కె.డి.వి.సత్యనారాయణరాజు అధ్యక్షతన ఒక ఆహ్వాన సంఘం ఏర్పడినది. ఇతర ప్రాంతాల నుంచి మహాసభకు వచ్చే ప్రతినిధులకు ఉచిత వసతి,భోజనసౌకర్యాలు ఏర్పాటుచేశారు. ప్రతినిధి రుసుం రెండు రూపాయలు.

జాతీయ దినం : అధ్యక్ష, కార్యదర్శుల ప్రకటన

ఆంధ్రప్రదేశ్ శాంతిసంఘం అధ్యక్షులు శాసనసభ్యులు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య, కార్యదర్శులు డాక్టర్ బి. వి. ఎస్. ఎస్. రాజు, శ్రీ శ్రీనివాస లాహోటి నేడొక సంయుక్తప్రకటనచేస్తూ ఈనెల 27వ తేదీన"జాతీయదినం"గాపరిగణించిసామ్రాజ్యవాదులు భారతదేశంపట్ల అనుసరిస్తున్న కుటిల రాజనీతిని ఖండిస్తూ సభలు,సమావేశాలు జరుప వలసినదిగా విజ్ఞప్తి చేశారు.

తాడేపల్లిగూడెం కౌన్సిల్ బడ్జెట్

తాడేపల్లిగూడెం, నవంబర్ 22— తాడేపల్లిగూడెం పురపాలక సంఘం 1964-65 వార్షిక పరిపాలనా నివేదికను కార్యదర్శి శ్రీ జి. వేంకటరావు కౌన్సిల్‌లో మొన్న ప్రవేశపెట్టారు. ఈ నివేదిక ప్రకారం పట్టణ ఆదాయవ్యయాలు హెచ్చాయి. మొత్తం డిమాండ్ రు. 4,71,022 లోరు. 1,94,532 వసూలు కాలేదు. ఓపెనింగ్ లోగడ రు. 5,13,474 కాగా గత సంవత్సరం రు 5,24,384 లు. మొత్తం రాబడి లోగడ రు. 6,06,240 కాగా గత సాలులో రు 7,20,675 లు. లోగడ ఖర్చు రు. 5,1,535 లు కాగా గత సంవత్సరం రు. 6,32,347 లు. క్లోజింగ్ బాలెన్స్ లోగడ రు. 5,24,384 కాగా నిరు రు రు. 6,12,712 లు.

'ఉపాధ్యాయులు ప్రైవేట్లుమానాలి'

రాజానగరంలో పరిషత్ చైర్మన్ శ్రీ సత్యనారాయణరావు విజ్ఞప్తి

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

రాజమండ్రి, నవంబర్ 22 — తూర్పు గోదావరి జిల్లాపరిషత్ చైర్మన్ శ్రీ ఎస్.బి.పి బి. కె. సత్యనారాయణరావు 15 వ తేదీ ఉదయం రాజానగరంలోగల జిల్లాపరిషత్ హైస్కూల్‌కు శ్రీ మూడిన వెంకటరత్నం దానం చేసిన ఆరుఎకరాల భూమిలో లక్షరూపాయల వ్యయంతో నిర్మించబోయే భవనానికి శంకుస్థాపనచేస్తూ ఉపాధ్యాయులు తమ ప్రయివేట్లు మాని తరగతులలోనే విద్యార్థులకు హృదయపూర్వకంగా విద్యగరపవలసినదిగా విజ్ఞప్తి చేశారు. రాజానగరం సమితి ప్రెసిడెంట్ సభకు అధ్యక్షత వహించారు.

హైస్కూల్ కమిటీ అధ్యక్షులు, శాసన సభ్యులు శ్రీ వడ్డి ముక్కాలరావు తొలుత స్వాగతం పలుకుతూ 1959 లో శ్రీ పట్టాభిరామారావు విద్యామంత్రిగా వున్నప్పుడు ఈ హైస్కూల్ ప్రారంభమై, జిల్లా ప్లానింగ్ ఆఫీసర్ శ్రీ గుండపునీడి జానకి రామయ్య ప్రోద్బలంతో దినదినాభివృద్ధి పొందుతున్నదన్నారు. స్కూల్ కమిటీ కార్యదర్శి శ్రీ వక్కలంక సత్యనారాయణమూర్తి, హెడ్మాస్టర్ శ్రీ ఎస్. వేంకటేశ్వర్లు శ్రీ సత్యనారాయణరావు సేవలను ఉగ్గడిస్తూ స్వాగతపత్రాలు సమర్పించారు. శాసన సభ్యులు శ్రీ బత్తిన సుబ్బారావు, శ్రీ సత్యనారాయణరావు విద్యా విషయంలో చేస్తున్న అధికకృషిని ప్రశంసించారు.

వీరవాసరంలో దొంగతనం

సొత్తుతోసహా నేరస్తుల పట్టివేత

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

భీమవరం, నవంబర్ 22 — ఇక్కడకు సుమారు ఎనిమిది మైళ్ళ దూరంలోగల వీరవాసరం గ్రామంలో ఇటీవల శ్రీమతి మండపల్లి సుశీలాబాయి గృహంలో దొంగలు పడి సుమారు రు. 4,500 లకిమ్మతుగల బంగారం మొదలైన వస్తువులు దొంగిలించారని వచ్చిన రిపోర్టుపై సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎ.శ్రీరామమూర్తం స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ల సహాయంతో దర్యాప్తుచేసి బొడ్డు వరదయ్య, దేవ వీరన్న అనే వారిని అరెస్ట్ చేసి చోరీ అస్తి వశపరచుకున్నారు. దొంగలపై పోలీసు వారు ఛార్జిషీట్ దాఖలు చేశారు.

వీరవాసరం - భీమవరం షటిల్ బస్‌సర్వీస్ ప్రతిపాదన

భీమవరం, నవంబర్ 22 — భీమవరం-హైదరాబాద్ రాత్రి బస్ సర్వీస్‌లో ప్రస్తుతం డీలక్స్ బస్ నడుస్తున్నది. ఇదికాక, పగటిపూట భీమవరం నుంచి హైదరాబాద్‌కు అదనంగా ఒక ఎక్స్‌ప్రెస్ బస్‌ను వేయడం ఇప్పట్లో సాధ్యంకాదని, అయితే ఈ బస్‌ను ప్రవేశపెట్టే అలోచనకలదని హైదరాబాద్‌లోని స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ చీఫ్ ఎగ్జిక్యుటివ్ ఆఫీసర్ వీరవాసరంనుంచి శ్రీ నిమ్మల శివానందం వ్రాసిన ఒక లేఖకు ఇటీవల జవాబు పంపారు.

వీరవాసరం-భీమవరం మధ్య షటిల్ సర్వీస్ బస్‌లు నడిపే ప్రతిపాదన కలదని, నరసాపురం నుంచి ద్వారకా తిరుమలకు భీమవరంమీదుగా సరాసరి బస్‌లను త్వరలో ప్రవేశపెట్టగలమని, ముఖ్యమైన కూడలి ప్రాంతాలలో ప్రయాణీకుల సౌకర్యార్థం వేసైడ్ షెల్టర్లు, మంచినీటి సదుపాయాలు ఏర్పాటు చేయబడగలవని కూడా ఆ లేఖలో వున్నట్టు ఆయన తెలియజేశారు.

నూజివీడులో హవల్దార్ పోతరాజుకు సన్మానం

తాలూకా పట్టణ అభివృద్ధి సమితి ఆధ్వర్యాన

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

నూజివీడు, నవంబర్ 22—కృష్ణాజిల్లా, నూజివీడు తాలూకా పట్టణ, అభివృద్ధి సమితి ఆధ్వర్యాన దేశరక్షణ-ప్రజల కర్తవ్యాలను ప్రబోధిస్తూ రేపు నెల 13 నుంచి 17 వ తేదీ వరకు అధ్యక్షులు తిరువూరు మధుసూదనరావు నాయకత్వాన దళ ప్రచార కార్యక్రమం సందర్భంలో 17 వ తేదీన నూజివీడులో పాక్ కాలర్ జట్ విమానాన్ని మొట్టమొదట కూల్చిన హవల్దార్ తాతా పోతరాజుకు ఘన సన్మానం జరిపారు. రాష్ట్ర మద్యనిషేధ, సాంస్కృతిక శాఖలమంత్రి శ్రీ ఎం. ఆర్. అప్పారావు సన్మానసభకు అధ్యక్షత వహించారు. తొలుత పురవీధులలో శ్రీ పోతరాజు, రిటైర్డ్ మేజర్ శ్రీ రామారావును వూరేగించారు.

తాలూకా అభివృద్ధి సమితి కార్యదర్శి ఎ. ఎస్. ఆర్. కృష్ణ శ్రీ పోతరాజుకు స్వాగతం చెప్పారు. అధ్యక్షులు శ్రీఎమ్.ఆర్. అప్పారావు పోతరాజువంటి వీరులకు సన్మానం జరపడం అదృష్టమని, "వీరవక్ర" బిరుదు పొంది అయన ఆదర్శప్రాయుడయారని అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీ పిన్నమనేని కోటేశ్వరరావు సన్మానోత్సవం ప్రారంభిస్తూ పోతరాజును అభినందించారు. ఈ సందర్భంలో శ్రీ పోతరాజుకు పలుసంస్థలవారు సన్మాన పత్రాలు సమర్పించారు. జిల్లాలో మొట్టమొదటిగా శ్రీపోతరాజుకు సన్మానం జరిపిన అభివృద్ధి సమితిని అభినందిస్తూ, పోతరాజు వీరోచితకృత్యాన్ని కొనియాడుతూ శ్రీయుతులు ఆలపాటి లక్ష్మయ్య, దాసరి నాగభూషణరావు, తిరువూరు మధుసూదనరావు, కంచుల రామకృష్ణ, దేవినేని రాజారామ్, గోపాల నాగేశ్వరరావు, ఎస్. రామచంద్రరావు ఉపన్యసించారు.

రక్షణనిధికి అభివృద్ధిసమితి తరఫున దాసరి వెంకటసుబ్బయ్య గ్రామాలవారిగా రు.1170లు ప్రకటించారు. సభలో స్పోర్టింగ్ క్లబ్‌వారు రు.116, మిషన్ హాస్పిటల్‌వారు రు. 540, సైకిల్ టిన్కర్స్ యూనియన్‌వారు రు. 53, పాలస్టుయిందార్ల యూనియన్‌వారు రు. 10, శ్రీజోతరాజు రు.116,మరికొందరు రు. 31 ప్రకటించారు. కుమారి కుటరవల్లి పార్వతి బంగారపు బోగు ఇచ్చినది. సభలో శ్రీ వి. కె. రావు వేసినసైగ్రూప్ చిత్రపటాన్ని, జనసంఘంతరఫున ఇచ్చిన ఏనుగుబొమ్మను మేజర్ ఎన్. వి. ఎస్. రామారావు పాటు పెట్టగా ఆర్. టి. సి. నేషనల్ వర్కర్స్ యూనియన్‌వారు రు. 118 లకు పాడారు.

శ్రీ పోతరాజు తమకు జరిగిన సన్మానానికి ఉచితరీతిన కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ అడిదం వెంకటేశ్వరరావు, శ్రీ కృష్ణమూర్తిదాసు, శ్రీ పోతరాజునుగురించి పద్యాలు చదివారు. శ్రీ వడుపులేటి సత్యనారాయణ వందన సమర్పణ చేశారు.

చందోలు

చందోలు, నవంబర్ 22—ఈ నెల 16వ తేదీ ఉదయం చందోలు శ్రీ సీరి బంగారయ్య హైస్కూల్ ఆవరణలో హవల్దార్ శ్రీ తాతా పోతరాజుకు సన్మానం జరిగినది. ఉదయం శ్రీ పోతరాజు విద్యార్థి వందనం స్వీకరించిపతాకారోహణం జరిపారు. శ్రీపోతరాజును వురవీధులలో ఊరేగించారు. బాలబాలికల వ్యాయామ విన్యాసాలు శ్రీ పోతరాజు తిలకించారు. సభకు పిట్టలవానిపాలెం హయ్యర్ సెకండరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీ వి. పార్థసారథి అధ్యక్షత వహించారు. శ్రీ ఎ.ఎం.ఎం.కృష్ణమూర్తి స్వాగతం పలికారు. శ్రీ పరిమి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి స్వాగత పద్యాలు సమర్పించారు. శ్రీ వి.కృష్ణమూర్తి గేయపఠనంగావించారు.

హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీ ఎస్. బి. యస్. సోమయాజులు శ్రీ పోతరాజును సత్కరించారు. శ్రీ ఆలపాటి రాధాగోపాలకృష్ణమూర్తి, శ్రీ అడ్డేపల్లి బసవేశ్వరరావు తదితర గ్రామ ప్రముఖులు పలువురు సూతన వస్త్రాలచే శ్రీ పోతరాజును సన్మానించారు. సభలో శ్రీయుతులు వి.ఎల్. సుందరరావు, లెఫ్టినెంట్ జనాబ్ అబ్దుల్ సత్తార్ సాహెబ్, ఇక్కుర్తి ఆంజనేయులు మొదలయినవారు శ్రీ పోతరాజు ధైర్యసాహసాలను ప్రస్తుతించారు. శ్రీ పోతరాజు తమ యుద్ధానుభవాలు వివరించారు. శ్రీ డి. సదాశివరెడ్డి వందన సమర్పణ గావించారు.

ధూళిపూడి

రేపల్లె, నవంబర్ 22—ఈ నెల 19వ తేదీన రేపల్లె తాలూకా ధూళిపూడి గ్రామంలో హవల్దార్ తాతా పోతరాజుకు సన్మానం జరిగినది. సభకు శ్రీ భాస్కర నాయగుప్త అధ్యక్షత వహించారు. సభలో ఛాటీ బోర్డ్ చైర్మన్ శ్రీ అనగాని భగవంతరావు మాట్లాడారు.

సంగంజాగర్లమూడి

ఈ నెల 23వ తేదీ సాయంత్రం సంగంజాగర్లమూడిలో శ్రీ అనగాని భగవంతరావు అధ్యక్షతన శ్రీ పోతరాజుకు సన్మానసభ ఏర్పాటు చేశారు. గ్రామ వీధులలో వీరిని ఊరేగించారు. శ్రీయుతులు ఎనిగళ్ళ సత్యనారాయణ, మిక్కిలినేని భగవతరావు ప్రభృతులు సభలో మాట్లాడారు.

శనగనూనెలో కల్తీకి ఆరు నెలల జైలు

పొన్నూరు వర్తకునికి వెయ్యి రూపాయలు జరిమానా

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

పొన్నూరు, నవంబర్ 22—ఆహార పదార్థాల కల్తీ నివారణ చట్టం కింద బాపట్ల అడిషనల్ డిస్ట్రిక్ట్ మునిసిఫ్ మేజిస్ట్రేట్ శ్రీ వి. నీలిసాహెబ్ ముందు ఈ కీలక కేసులు విచారించి జరిమానాలు, జైలుశిక్షలు విధించారు: పొన్నూరులో కల్తీ పాలు అమ్మిన నేరానికి పాకూరి నాగేశ్వరరావు, దాసరి గోపాలరావు, కాపూరి క్రిష్ణయ్యలకు రు. 200 జరిమానా, ఆరు మాసాలు జైలుశిక్ష, కల్తీ వేరుశనగ నూనె అమ్మిన నేరానికి మద్దాల నరసింహారావుకు రు. 1,000 జరిమాన, ఆరుమాసాలు జైలుశిక్షవిధించారు.

కేసులు పొన్నూరు మునిసిపల్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ బి. శోభనాద్రి దాఖలుచేశారు. బాపట్ల ఎ.పి.పి. శ్రీని. ఆంజనేయులు కేసులు నిర్వహించారు.

ప్రణయంలోపడిన పోలీసు ఆత్మహత్య

మైసూరులో సంఘటన

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

మైసూర్, నవంబర్ 22— మైసూరు గవర్నర్ రాజభవన్‌లోని రిజర్వు కాన్స్టేబుల్ తిమ్మయ్య అనే అతను తాను ప్రేమించిన యువతి తనను వంచించినదని జుగుప్సచెంది తన రివాల్వర్‌తోనే కాల్చుకొని మొన్న ఆత్మహత్య చేసుకున్నట్టు తెలియవచ్చినది.

విద్యార్థి ఆత్మహత్య

కందుగుల గ్రామంలో దుస్సంఘటన

హుజూరాబాద్, నవంబర్ 22—హుజూరాబాద్ తాలూకాకు చెందిన కందుగుల గ్రామంలో ఇటీవల ఎంట్రెన్స్‌తరగతిలోనున్న సత్యరాల హరిజన విద్యార్థి మరణించాడు. శవపరీక్ష హుజూరాబాద్‌లో జరిపించారు. ఈ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న కారణం తెలియలేదు. హుజూరాబాద్ పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎల్. కృష్ణమూర్తి దర్యాప్తు చేస్తున్నారు.

బుధవారం
నవంబర్ 24
(శక 1887 మార్గశిర 3)
విజయవాడ

357.1 మీ (840 కిలో సై)

ఉ॥ 6-30 వందేమాతరం, సుప్రభాతం, 7-30 సంగీత శిక్షణ, 7-45 వి. బి. కనకదుర్గ, మ॥ 11-45 ఉన్నత పాఠశాలలకు, 1-00 మహిళా సమాజం, సా॥ 6-30 వ్యవసాయక విషయాలు, 7-30 మన పట్టణాలు ఎదుర్కొంటున్న సమస్యలు - మురికివాడల పరిహారణ 7-40 ఈనెల పాట, 8-00 నాటిక, 8-30 విశ్వవిద్యాలయాలకు, 9-25 వినామ సంగీతం, 9-50 లలితసంగీతం, 10 00 వి. బి, కనకదుర్గ.

హైదరాబాద్-ఎ

405.4 మీ (740 కిలో సై)

ఉ॥ 6-30 వందేమాతరం, 7-15 లలిత సంగీతం, 7-30 గానసుధ, 7-45 ఆంథోనీ మాథ్యూస్

హైద్రాబాద్ రేడియో కేంద్రంలో 50 కిలోవాట్ల ట్రాన్స్‌మిటర్ స్థాపన

వచ్చేతెలుగుసంవత్సరాదినుంచి ప్రారంభం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్, నవంబర్ 22—

ఆలిండియా రేడియో హైదరాబాద్ కేంద్రంలో నెలకొల్పబడిన 50 కిలోవాట్ల మీడియమ్ వేవ్ ట్రాన్స్‌మిటర్ వచ్చే తెలుగు సంవత్సరాది నుంచి పని ప్రారంభిస్తుంది.

ఈ ట్రాన్స్‌మిటర్ పెట్టడంతో హైదరాబాద్ కేంద్రం శక్తి అయిదురెట్లకు పెరిగింది. అంటే ఇప్పుడు రాష్ట్రంలో ఏమూలనుంచైనా హైదరాబాద్ కార్యక్రమాలను స్పష్టంగా వినవచ్చు.

హైదరాబాద్ స్టేషన్ డైరెక్టర్ డాక్టర్ అయ్యగారి వీరభద్రరావు ఇటీవల యిచ్చిన ఇంటర్వ్యూలో ప్రస్తుతం హైదరాబాదు స్టేషన్ ట్రాన్స్‌మిటర్ వంద మైళ్ళవరకే వినబడుతుందని చెప్పారు.

ట్రాన్స్‌మిటర్‌కు సంబంధించిన సివిల్ వర్క్సు పూర్తిచేయబడ్డాయని, మిగతావనులు పూర్తిచేయబడుతున్నాయని ఆయన తెలియజేశారు. 450 అడుగుల ఎత్తు స్తంభమొకటి ఏర్పాటుచేయాలని, ఈ పనికి కొంతకాలం పట్టవచ్చునని డాక్టర్ వీరభద్రరావు తెలియజేశారు.

హైదరాబాదు కేంద్రం చేబట్టబోయే ముఖ్య కార్యక్రమాలలో శ్రోతల పరిశోధన కేంద్రం ఒకటిని తెలియజేశారు. ఈ కేంద్రం శ్రోతల అభిరుచులను పరిశోధనచేసి ప్రసారంచేసిన కార్యక్రమాలపట్ల వారి అభిప్రాయాలు తెలుసుకుంటుంది. వారి సూచనలేమైనా ఉంటే గౌరవిస్తుంది. ఇందు మూలంగా రేడియోలో మంచి కార్యక్రమాలు ప్రసారం చేయడానికి వీలవుతుంది.

రక్షణ ప్రయత్నాలకు సంబంధించి ప్రవేశపెట్టిన "దీక్ష" కార్యక్రమానికి బాగా ప్రచారం వచ్చిందని ఆయన అన్నారు.

ఇక్కడ ప్రసారమయ్యే కార్యక్రమాలకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రక్షణ ప్రయత్నాలతో సంబంధమున్నదని ఆయన అన్నారు. వ్యవసాయ కార్యక్రమం ముఖ్యంగా అధికాహారోత్పత్తికి ఉద్దేశించబడ్డదని అక్షయ అన్నారు.

త్వరలో హైదరాబాద్ ఆకాశవాణి వ్యవసాయ వార్తల బులెటిన్‌ను రోజుకొకసారి ఒక వారానికి మూడుసార్లు కాని ప్రసారం చేస్తుందని డాక్టర్ వీరభద్రరావు తెలియజేశారు.

ఇకనుంచి కార్యక్రమాల ప్రసారం 6.30 గంటలకు బదులు ఆరు గంటలకే ప్రారంభించబడుతుందని, భక్తిరంజని కార్యక్రమం అరగంట ఉంటుందని ఆయన తెలియజేశారు.

జానపద సంగీతాన్ని పరిరక్షించడానికి హైదరాబాదు కేంద్రం బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిందని శ్రీ వీరభద్రరావు అన్నారు.

హైదరాబాద్ కేంద్రంనుంచి లలిత సంగీతం ప్రసారం చేయడం కూడా తమ ఉద్దేశ్యమని అది కేవలం ఫిల్మ్‌సంగీతానికి పోటీకాదు అనుకరణకాదని ఆయనఅన్నారు

హైదరాబాదు కేంద్రంనుంచి ప్రసారం 12.30 గంటల వివిధ భారతి కార్యక్రమంలో 7 గంటల కార్యక్రమం స్వయంగా ఇక్కడనుంచి ప్రసారంచేస్తామని, మిగిలింది రిలే చేయబడుతుందని ఆయన తెలియజేశారు. లలిత సంగీతం, డ్రామాలు, తెలుగు ఫిల్మ్ సంగీతం ఈ ఏడు గంటల కార్యక్రమంలో ఉంటాయని ఆయన తెల్పారు.

హైదరాబాద్ కేంద్రం ప్రసారంచేసే తెలుగు కార్యక్రమాలు సంపూర్ణంగా ఆంధ్రత్వాన్ని ప్రతిబింబించేవిగా ఉండడం తమ అభిమతమైనట్లు డాక్టర్ వీరభద్రరావు తెలియజేశారు.

హైదరాబాద్ ఎన్. సి. సి. పెరేడ్

ముఖ్యమంత్రిచే సైనిక వందన స్వీకారం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, నవంబర్ 22— ఇటీవల జరిగిన ఇండో పాక్ యుద్ధసమయంలో కీలక పరిశ్రమలను కాపాడడంలోనూ పౌర రక్షణ కార్యక్రమాలను నిర్వహించడంలోనూ ఎన్. సి. సి. అద్భుతమైన పాత్ర వహించిందని ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి ప్రశంసించారు.

నిన్న ఉదయం హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్సులో ఎన్. సి. సి. వారిచ్చిన సైనిక వందనం స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ నాల్గవ ప్రణాళికాంతానికి ఎన్.సి.సి.ని రెండు లక్షలకు పెంచాలని ప్రభుత్వ సంకల్పమని అన్నారు.

రాష్ట్రంలో వివిధ ప్రాంతాలనుంచివచ్చిన కాడెట్లు నుద్దేశించి "మీరు స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పరిరక్షకులుగా" భావింపబడుతున్నారని శ్రీ బ్రహ్మానందరెడ్డి అన్నారు.

ఈ ఎన్.సి.సి పెరేడ్‌కు మేజర్ అనంతరావు నాయకత్వం వహించారు. స్థానికంగా రెండు స్కూళ్ళనుంచి బాలబాలికలతో కూడిన కాడెట్లు డ్రిల్ ప్రదర్శన చేశారు. వాయు, నౌకా సైనికదళాలకుచెందిన మూడు విభాగాలు పెరేడ్‌లో పాల్గొన్నాయి.

బ్యాంకుల తనఖాలోని ఆహారధాన్యాల నిల్వలు

స్వాధీనపరచుకొనే ప్రశ్న లేదని కేంద్ర ఆర్థికమంత్రి వివరణ

న్యూఢిల్లీ, నవంబర్ 22—

"బ్యాంకుల తనఖా కింద ఆహారధాన్యాల నిల్వలను స్వాధీనపరచుకొనే సంకల్పం లేదు" అని ఆహార మంత్రి తరఫున కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి నేడు రాజ్యసభలో చెప్పి డించారు.

శ్రీ భార్గవ అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ కృష్ణమాచారి జవాబు చెబుతూ ఏదైనా అట్టి అవసరం ఏర్పడినప్పుడు "ఈ విషయం మనం పరిశీలించవలసి వుంటుంది" అని అన్నారు.

ఆహారధాన్యాల సేకరణ కార్యక్రమం కింద ఉత్పత్తిదారులపైన, మిల్లర్సు, వర్తకులపైన లెవీలను విధించవలసి వచ్చినదని ఆహారశాఖ ఉపమంత్రి శ్రీ డి.ఆర్. చావన్ ఇంతకుపూర్వం తెలిపారు.

ఉత్పత్తిదారులపై లెవీ ఎకరాల ప్రాతిపదికపై వుంటుందని ఆయన అన్నారు.

దేశంలో గరిష్ఠ పరిమాణంలో ఆహారధాన్యాలు సేకరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చురుకుగా చర్యలు తైకొంటున్నవని ఆహార శాఖ ఉపమంత్రి శ్రీ అబిద్ ఘనా అడిగిన ప్రశ్నకు జవాబుగా తెలిపారు.

మిగులురాష్ట్రాలలోనే కాక, కొరత రాష్ట్రాలలో కూడా ధాన్యం ప్రొక్యూర్‌మెంటు జరుగుతుందని, ధాన్యం, బియ్యం, కాయధాన్యాలు, దుంపకరకం ధాన్యం సేకరిస్తారని అన్నారు.

ప్రొక్యూర్‌మెంటు పద్ధతిలో వేరు వేరు రాష్ట్రాలు వేరు విధానాలను అవలంబించినప్పటికీ నిర్బంధలెవీ ద్వారా ధాన్యం సేకరణ విషయంలో అన్ని రాష్ట్రాలలో ఒకే విధానం అమలులో వున్నదని ఆయన తెలిపారు.

వినోదం పన్ను రద్దుకు విజ్ఞప్తి

ప్రదేశ్ ఫిలింఫాన్స్ అసోసియేషన్ ప్రకటన

విజయవాడ, నవంబరు 22—

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల వినోదం పన్నును హెచ్చించిన ఫలితంగా సినిమా థియేటర్లలో వసూళ్ళుతగ్గినట్టు వార్తలు వచ్చాయి. వినోదం పన్నును హెచ్చించిన తమిళనాడులో కూడా ఇలాగే జరిగింది. పన్ను ద్వారా అధికాదాయాన్ని లక్షించి, ప్రభుత్వం హెచ్చింపు చేసింది. ఆలక్ష్యం నెరవేరకపోగా పన్ను ఎక్కువ పన్ను ద్వారా ప్రజలను ఇబ్బంది పెట్టడంలో న్యాయంలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇకనైనా పన్నును యథాపూర్వస్థితికి తగ్గించగలదని ఆశిస్తున్నాము."

అఖిల భారత రైల్వే పనివారల సమాఖ్య వారిక మహాసభ నవంబర్ 27 న చేపట్టిన మద్రాసులో ప్రారంభమౌతుంది.

హైదరాబాద్‌లో సర్వే శిక్షణ కేంద్రం

ఐక్యరాజ్యసమితి సంస్థగా మార్పుకు ఒప్పందం

డెహ్రాడూన్, నవంబర్ 22— హైదరాబాద్‌లో ప్రస్తుతం వున్న భారత సర్వే శాఖ వారి శిక్షణా వ్యవహారాల డైరెక్టోరేట్‌ను సర్వే వ్యవహారాలను ఐక్యరాజ్యసమితి శిక్షణా కేంద్రంగా మార్చడానికి ఒప్పందం కుదిరింది. సర్వేయర్లు, మ్యాపుల రచన మొదలైన వాటిలోను, దీనికి సంబంధించిన సాంకేతిక విషయాలలోనూ ఆగ్నేయాసియా దేశాలకుచెందిన అభ్యర్థులకు ఈ కేంద్రంలో శిక్షణ ఇస్తారు.

ఈ శిక్షణ కేంద్రానికి భారతీయ డైరక్టర్‌ను త్వరలో నియమిస్తారు.

డెహ్రాడూన్‌లోని భారత సర్వేశాఖ ప్రధాన కార్యాలయంలో ఈ సంస్థకు సరాసరి సంబంధం ఉంటుంది.

కొబ్బరికాయలు [1000]

విజయవాడలో	కొత్తవి	390.00
	పాతవి	510.00
పాలకొల్లులో	కొత్తవి	350.00
	పాతవి	490.00
అమలాపురం	పాతవి	500.00
	కొత్తవి	340.00

ధరలు

విజయవాడ, నవంబర్ 22 —

బులియన్ మార్కెట్

కిండి 15 కి.గ్రా		296.00
10 గ్రా		3.10

బియ్యం ధరలు

నంబర్లు (కిచిడి)	100 కి.గ్రా	74.06
అక్కుళ్లు		63.00

అపరాలు

కందులు	100 కి.గ్రా	90.00
మినుములు		76.00
పెసలు కొత్తవి		87.00
పెసలు పాతవి		83.00
శనగలు		173.91
వేరుశనగకాయ		106.52
వేరుశనగపప్పు		162.50
వేరుశనగనూనె		127.50

ధాన్యం ధరలు

అక్కుళ్లు	75 కి.గ్రా	29.25
నంబర్లు (కిచిడి)		34.50

మద్రాసు మార్కెట్

మద్రాస్, నవంబర్ 22 —

వేరుశనగనూనె	ఓపెనింగ్	330.00
వేరుశనగపిండి		37.50
వేరుశనగ పప్పు		126.00
ఆముదం నూనె		280.00

వ్యవసాయ విశ్వవిద్యాలయ పరీక్షా ఫలితాలు

హైదరాబాద్, నవంబర్ 22 — ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం 1965 అక్టోబర్‌లో నిర్వహించిన బి.ఎస్సీ. (అగ్రికల్చర్) పరీక్షలో దిగువ రిజిస్టర్ నెంబర్లగల అభ్యర్థులు ఉత్తీర్ణులైనారని రిజిస్ట్రార్ ప్రకటిస్తున్నారు.

సెకండ్ ఇంటెగ్రేటెడ్

అగ్రానమీ : 162
అగ్రికల్చరల్ బోటనీ : 161
అగ్రికల్చరల్ కెమిస్ట్రీ : 161
అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ (సివిల్) : 161 63 నుంచి 74
యానిమల్ హస్‌బెండ్రీ, హైజీన్ : 161

థర్డ్ ఇంటెగ్రేటెడ్

అగ్రానమీ : 175 176
అగ్రికల్చరల్ బోటనీ : 175
అగ్రికల్చరల్ కెమిస్ట్రీ : 175 నుంచి 181
అగ్రికల్చరల్: ఎంటొమాలజీ: 184 185
అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ (మెకానికల్): 175
అర్థికల్చర్ : 175 76 82 83

ఫైనల్ ఇంటెగ్రేటెడ్

మైనాలజీ, ప్లాంట్ పాథాలజీ : 186

మీ బంగారాన్ని మేము శుభ్రపరుస్తాము. దానిని 23.88 కారట్ల రూపంలోకి మేలిమిపరచి శుభ్రపరుస్తాము. పదిహేను సంవత్సరాలు మన పవిత్ర భారత దేశానికి సేవచేయడానికి మీ బంగారాన్ని వినియోగించి శుభ్రపరుస్తాము. దేశ సేవా వేదికపై పవిత్రీకృతమయిన మీ బంగారం మేలిమి చేయబడి, మెరుగు పెట్టబడి, మాలిన్యరహితంగా మీకు మరల యివ్వబడుతుంది.

మేలిమి బంగారంకొరకు — బంగారు బాండ్లు కొనండి

బంగారంయొక్క ఆవశ్యకత దేశానికి మునుపెన్నడూ యింత ఎక్కువగా కలగలేదు. మనకు విదేశీ మారక ద్రవ్యం చాలా తక్కువగా ఉంది. ఎక్కువ బంగారం ప్రభుత్వంవారివద్ద ఉంటే ఎక్కువ విదేశీ మారక ద్రవ్యం అన్నమాట. మాకు బంగారం, మీ బంగారం, దేశ రక్షణకీ, మన బలానికి, స్వయం పోషకత్వానికీ, విదేశీ సహాయంమీద తక్కువగా ఆధారపడడానికీ కావాలి. విదేశాలనుండి ఆహార ధాన్యాలను కొనడానికి, మీకు ప్రియమైనవాడు ఆకలితో మాడి చచ్చిపోరని హామీ యివ్వడానికి, మాకు బంగారం కావాలి. ఇంకా యితరములయిన ముఖ్య వస్తువుల సప్లయిలకి, మన ఆర్థిక విధానాన్ని సమంగా నడపడానికి బంగారం అవసరం. మన ఆర్థిక విధానం ఉన్న తీరుపైననే, మీ భర్త, తండ్రి, సోదరులు - వీరి ఉద్యోగములు ఆధారపడి ఉంటాయి. ఈ క్లిష్ట పరిస్థితిలో. అవసర సమయంలో మీ బంగారాన్ని దేశానికి ముడుగా యిమ్మని ప్రభుత్వం మిమ్మల్ని అర్థిస్తోంది. మీ బంగారాన్ని అమ్మివేయమని కాని, ఊరకనే యిచ్చివేయమని కాని ప్రభుత్వం చెప్పుట లేదు. మీరు బంగారాన్ని, బంగారు నగలను, బంగారు మొహరీలను యిచ్చినప్పుడు, మీకు బంగారు బాండ్లు యివ్వబడుతాయి. పదిహేను సంవత్సరముల తర్వాత మీ బంగారం తిరిగి మీకు యివ్వబడుతుందని ప్రభుత్వం ప్రమాణ పూర్వకంగా చెప్తోంది. మీరు బంగారు బాండ్లకు 14 కారట్ల బంగారపు ఆభరణములను యిచ్చివుంటే 15 సంవత్సరముల తర్వాత మీకు యిచ్చిన బంగారాన్ని ఎన్ని కారట్ల మేలిమి బంగారపు ఆభరణములలోనికైనను మార్చుకొనవచ్చును.

బంగారు బాండ్లు ఎక్కడ దొరుకుతాయి?

బంగారు బాండ్లు రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలలోను, బెంగుళూరు, బొంబాయి, కలకత్తా, మద్రాసు, నాగపూర్. న్యూ ఢిల్లీలలో ఉన్న స్టేట్ బ్యాంకు సహాయ బ్యాంకులలోను, ప్రభుత్వ ఖజానా వ్యాపారం నడుపుతున్న సహాయ బ్యాంకుల బ్రాంచీలలోను, ఇండియాలో యితర స్థలాలలో ఉన్న స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచీలలోను యివ్వబడుతాయి. బంగారు బాండ్లను యిచ్చే చోటుకు వెళ్లి చిన్న దరఖాస్తు పత్రమును పూర్తి చేసి మీ స్వర్ణాభరణములను కాని, మొహరీలను కాని యివ్వండి. మీ ఎదుటనే అవి తూకము వేయబడి, ఒక కవరులో సీలు చేయబడతాయి. మీకు వెంటనే ఒక రసీదు ఇవ్వబడుతుంది. మీకు బంగారం ఎలా లభించింది అన్న విషయాన్ని గూర్చి ప్రశ్నించరు. 'స్వర్ణ నియంత్రణ ఉత్తర్వు' క్రింద ఎట్టి చర్య తీసికొనబడదు.

మీ బంగారం మేలిమి పరచబడుతుంది

మీ బంగారం ఉన్న సీలుచేసిన కవరు ప్రభుత్వ మింట్‌కు పంపబడుతుంది. అక్కడ నిపుణులు దానిని కరగించి, 23.88 కారట్ల మేలిమి బంగారం రూపంలోకి, పనిముట్ల సహాయంచేత తయారు చేస్తారు. మేలిమి చేయబడిన బంగారం తూకాన్ని రిజర్వు బ్యాంకుకు, మీ బంగారాన్ని స్వీకరించిన బ్యాంకుకు తెలియజేస్తారు.

> **పన్నులనుండి మినహాయింపు**
>
> బంగారు బాండ్లపై మీకు వచ్చే ఆదాయతి రాబడి పన్నునుంచి మినహాయించబడుతుంది. వాటిని అమ్ముటవల్ల, మార్చుటవల్ల వచ్చే లాభాలుకూడా రాబడి పన్నునుంచి మినహాయింపబడుతాయి. బంగారు బాండ్లకు లాభాల పన్ను ఉండదు.
>
> **సెక్యూరిటీగా బంగారు బాండు**
>
> బంగారంవలెనే బంగారు బాండ్లనుకూడా సెక్యూరిటీగా పెట్టి మీరు బ్యాంకులనుండి సొమ్మును తీసుకోవచ్చును.

బంగారు బాండ్లు యిచ్చుట

మీ బంగారాన్ని స్వీకరించిన బ్యాంకు మీకు బంగారు బాండ్లనుఇస్తుంది. మీ పేరుమీద ఉన్న మేలిమి బంగారం తూకాన్ని తెలియపరుస్తున్న రిజర్వు బ్యాంకు వద్దనుండి వచ్చిన రసీదుకూడ మీకు యివ్వబడుతుంది.

బంగారు బాండ్లపై ఆదాయం

మీరు స్వర్ణ ఆభరణములను ఇచ్చి ఉంటే, మీరు నగలు చేయించుటకు యిచ్చిన కూలికి బదులుగ బ్యాంకు మీకు 10 గ్రాముల మేలిమి బంగారానికి (ఒక తులం బంగారం, 11.6 గ్రాములకు సమానము) యా 3/- యిస్తుంది. ఈ మొత్తం బంగారు బాండ్లతో యివ్వబడుతుంది. ప్రతి సంవత్సరం మీకు 10 గ్రాముల మేలిమి బంగారానికి 2 రూ/- చొప్పున (ఒక కాసు అంటే 8 గ్రాములు) సంపాదిస్తారు.

బహుమతులుగా బంగారు బాండ్లు

మీరు మీ పిల్లలకుగాని, లేక మీ కిష్టమయిన యింకెవరికైనా కాని బంగారు బాండ్లను బహుమతులుగా వారిపేర యివ్వవచ్చును. సంవత్సరానికి 5,000 గ్రాముల (431 తులాలు) బంగారానికి బాండ్లు పొందిన మొట్టమొదటి వానికి బహుమతి పన్ను విధించబడదు. 50 కిలో గ్రాముల తూకపు విలువకలిగిన బంగారు బాండ్లు, బాండు హోల్డరు మరణించిన తరువాత వారసులకి చెందేటప్పుడు మొదటిసారి ఎస్టేటు సుంకమునుండి మినహాయింపబడుతాయి.

మీరు తిరిగి మేలిమి బంగారాన్ని పొందుతారు

15 సంవత్సరాల తరువాత మీరు మీ బంగారాన్ని 23.88 కారట్ల మేలిమి రూపంలో పొందుతారు. మీరు యిచ్చిన ఎంత బంగారాన్ని బంగారు బాండ్లలో పెట్టబడిగా పెట్టారో, దానిపైనే, దేశంయొక్క, మీకు ప్రియమైన వారియొక్క భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. దేశ సేవకు వినియోగించడానికి మీ బంగారాన్ని యివ్వండి.

ఆర్థిక మంత్రాలయము, భారత ప్రభుత్వము వారిచే ప్రకటింపబడినది

మీకు ప్రియమైన వారి కొరకు మీ బంగారాన్ని పెట్టుబడిగా పెట్టండి

So good to grow up with the sunshine breakfast food

మోహన్స్ న్యూ లైఫ్ కారన్ ఫ్లేక్స్

మీరు మీ పిల్లలకు అతి ప్రీతికరమగు మోహన్స్ న్యూ "లైఫ్ కారన్ ఫ్లేక్స్" ను ఉదయానే అల్పాహారంగా నిచ్చినట్లయితే అది మీ పిల్లలు దృఢముగాను, శక్తివంతంగాను ఎదగడానికి తోడ్పడుతుంది.

100 సంవత్సరాలకుపైగా అనుభవంతో మా ఉత్పత్తులు ఖ్యాతి గాంచినవి.

డైయర్ మేకిన్ బ్రేవరీస్ లిమిటెడ్.

స్థాపితం - 1865

మోహన్ నగర్, ఘజియాబాద్ (ఉ. ప్ర.)

DMB—NP—716

Printed and Published by K. L. N. Prasad at Andhra Printers Ltd., VIJAYAWADA-2.
Editor : Narla Venkateswara Rao.